PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 201, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 11 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్



2లో

- రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ
- ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను

# రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

### రివ్యూలతో కాలయాపన వద్దు, ఫలితాలు చూపాలని కలెక్టర్లకు సీఎం స్పష్టీకరణ

- ప్రో-యాక్టివ్‌గా పనిచేస్తూ, అభివృద్ధిలో జిల్లాలు, శాఖలు పోటీ పడాలని దిశానిర్దేశం
- 'సీఈఓ' గుర్తింపు కన్నా 'వాటర్ మ్యాన్' అని పిలిపించుకోవడమే తనకు సంతృప్తి అన్న సీఎం
- నకిలీ ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని, వాస్తవ నివేదికలు ఇవ్వాలని అధికారులకు సూచన
- 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'తో స్వర్ణాంధ్ర సాధన సాధ్యమన్న చంద్రబాబు





అమరావతి: “గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి” అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, మిగతా 2 లో



2లో

### స్వచ్ఛతాన్' పోస్టర్‌ను రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్

- స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్ లాంచ్
- రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు
- ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి
- దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే అవకాశం

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం



2లో

అక్రమాలు జరిగిన 4 లక్షల ఎకరాలపై విచారణ తర్వాత నిర్ణయం

దీర్ఘకాలిక భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

28 లక్షల ఎకరాలు 22-ఏ జాబితా నుండి తొలగింపు

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

### విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి



హైదరాబాద్: తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై ‘ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల’ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి మిగతా 2 లో

# బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి

### “వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలి

- సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర





హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరిగింది. ఈ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. “వెయ్యి రోజుల పాలనను ప్రజలకు వివరించాలని అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నాం. సభ జరగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసింది. ఆ పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించి సభను సజావుగా జరగకుండా చేశారు. మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారు. స్పీకర్‌ను అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. ప్రతిపక్షం కుట్రలను బలంగా తిప్పికొట్టాలి. ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని అభినందిస్తున్నా. ఎమ్మెల్యేలు సభకు హాజరై చర్చల్లో పాల్గొనాలి” అని రేవంత్ దిశానిర్దేశం చేశారు.



2లో

### కాకినాడ జిల్లాలో పులి సంచారం.. రంగంలోకి దిగిన పవన్ కళ్యాణ్

- కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా

### స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న

- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మిగతా 2 లో



2లో

### ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

- ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు
- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ
- పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు
- ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ

### ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి.. టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి: సీఎం చంద్రబాబు



2లో

- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కొత్త తరం నాయకత్వ పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన
- పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం
- అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం



2లో

### దుష్ప్రచారాలు నమ్మొద్దు గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

- గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదన్న రంగనాథ్
- సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని వెల్లడి

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా: జగన్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## రివ్యూలు కాదు.. రిజల్ట్స్ కావాలి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి: "గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్'.. ఇదే మన మిషన్

ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

'సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందం

ఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు వాటర్‌మ్యాన్' అంటూ ప్రచురించిన కథనాన్ని ప్రస్తావించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు, ఆ గుర్తింపు తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు. "గతంలో గ్లోబల్ డ్రీమ్ కేబినెట్‌లో నా పేరు వచ్చినప్పుడు గానీ, నన్ను సీఈఓ సీఎం అన్నప్పుడు గానీ నేను ఇంతలా సంతోషించలేదు. రాష్ట్రంలోని కరవు ప్రాంతాలకు, భౌగోళిక అసమానతల కారణంగా నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించగలిగినప్పుడే నాకు నిజమైన సంతృప్తి. ఆ నీటి భద్రత, సంరక్షణ చర్యలను గుర్తించి 'వాటర్ మ్యాన్' అని పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సాగునీటి రంగంలో ముఖ్యమంత్రి కృషికి అభినందనగా సమావేశంలో ఉన్న కలెక్టర్లు, అధికారులు, మంత్రులు లేచి నిలబడి చప్పట్లతో (స్టాండింగ్ ఓవేషన్) గౌరవం తెలిపారు.

టీమ్ విజయంతోనే అభివృద్ధి సాధ్యం

గడిచిన 27 నెలల్లో రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టామని, రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశామని సీఎం వివరించారు. "హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లిచ్చాం. పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఈ విజయాలన్నీ ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు. ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో పాటు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు అందరూ ఒక జట్టుగా పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది. ఇది టీమ్ సక్సెస్" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు

తమిళనాడు: ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## వందేమాతరంపై కాంగ్రెస్ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్.. కారణమిదే

ఢిల్లీ: జమ్ముకాశ్మీర్‌లో అధికారంలో ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), కాంగ్రెస్ కూటమిలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. 'వందేమాతరం' గీతాలాపన విషయంలో తలెత్తిన ఈ వివాదం, కూటమిలోని ఆధిపత్య పోరుకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల శ్రీనగర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా కేంద్ర ప్రభుత్వ నూతన నిబంధనల మేరకు ఆరు చరణాల పూర్తి 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో గౌరవసూచకంగా నిలబడ్డారు. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. 1937 నాటి పార్టీ తీర్మానం ప్రకారం వందేమాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని, మిత్రపక్షాలు కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారు. కాంగ్రెస్ సూచనను నేషనల్ కాన్ఫరెన్స్ తోసిపుచ్చింది. పార్లమెంటు చట్టం ప్రకారం జాతీయ గీతాలను గౌరవించడం తమ రాజ్యాంగబద్ధమైన విధి అని, దీనికి పార్టీల సిద్ధాంతాలతో సంబంధం లేదని ఎన్సీ అధికార ప్రతినిధి తన్వీర్ సాదిక్ స్పష్టం చేశారు. అయితే, ఈ రెండు పార్టీల మధ్య వివాదం కేవలం వందేమాతర గీతానికి పరిమితం కాలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎన్సీ 42 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ కేవలం 6 స్థానాలకే పరిమితమైంది. దీంతో కూటమిలో తమదే పైచేయి అని నిరూపించుకునేందుకు ఎన్సీ ప్రయత్నిస్తోంది. గతంలో కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారం, రాష్ట్ర హోదాపై ఆందోళనలు, రాజ్యసభ సీట్ల కేటాయింపు వంటి అంశాల్లోనూ ఉభయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 1987లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం వల్ల తమ ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతిన్నదనే భావన ఎన్సీ శ్రేణుల్లో బలంగా ఉంది. ఈ చారిత్రక కారణాల వల్లే కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఎన్సీ నాయకత్వం గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తోంది.

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి.. టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్‌షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్‌షిప్ - న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి'' అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

## 9 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములకు రిజిస్ట్రేషన్ అవకాశం

అమరావతి : రాష్ట్రంలో శతాబ్దాల కాలంగా కొనసాగుతున్న భూసమస్యలకు చరమగీతం పాడుతూ, భూయజమానులకు వారి ఆస్తులపై సంపూర్ణ హక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో నిబంధనల ప్రకారం ఉన్న 9 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇస్తున్నట్లు చెప్పారు. అయితే ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన 4 లక్షల ఎకరాలపై పూర్తిస్థాయి విచారణ తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా 22-ఏ (నిషేధిత) జాబితాలో చేర్చిన 28 లక్షల ఎకరాలను ఇప్పటికే తొలగించామని తెలిపారు. 22-ఏ తొలగింపు ప్రక్రియను సులభతరం చేస్తూ జీవో నెం.444 జారీ చేశామని, దీని ద్వారా వచ్చిన 28,790 ఎకరాల దరఖాస్తుల్లో ఇప్పటికే 1,100 ఎకరాలను జాబితా నుంచి తొలగించామని, మిగిలిన వాటిపై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఇకపై ఏదైనా ప్రైవేట్ భూమిని 22-ఏ జాబితాలో చేర్చాలంటే సంబంధిత అధికారే ఆ భూమి స్వభావాన్ని నిరూపించాల్సి ఉంటుందని, అందుకు స్పష్టమైన విధివిధానాలతో జీవో నెం.445 తెచ్చామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో పెడితే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వట్టిచెరుకూరు, శెట్టిపల్లి, పుల్లడిగుంట, కంగుంది, అవులపల్లి, గూటుపల్లి సహా కోనసీమ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో వేలాది మందికి ఆస్తులపై హక్కులు పునరుద్ధరించామని చెప్పారు. కైకలూరు నియోజకవర్గంలోనూ స్థానిక ఎమ్మెల్యే చొరవతో నాలుగు గ్రామాల్లోని రెండు వేల ఎకరాలకు పైగా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికై "మీ భూమి - బ్లాక్‌చైన్ టెక్నాలజీ" ప్రాజెక్ట్ ను అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ ను విజయవంతం చేసేందుకు కలెక్టర్లు నిరంతరం ప్రాజెక్టు అమలు తీరును పర్యవేక్షించాలన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి తప్పులకు ఆస్కారం లేకుండా రీ సర్వే 2.0ను సమర్థవంతంగా చేస్తున్నామని, సర్వే శాఖ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరగడం సంతోషకరమని, అయితే వందశాతం తప్పుల్లేకుండా రీ సర్వే చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు.

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

హైదరాబాద్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్‌ఈఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్‌ఈఎస్‌ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

## స్వచ్ఛతాన్' పోస్టర్‌ను రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్

అమరావతి: సూర్య స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న విజయవాడలో భారీ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛతాన్ పోస్టర్ ని మానవ వనరుల అభివృద్ధి, విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట పక్కన గల తమ నివాసంలో ఆవిష్కరించారు. స్వచ్ఛతా రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకునేందుకు అమరావతిరన్నర్స్.కామ్ పోర్టల్‌ని కూడా మంత్రి లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఈ ఈవెంట్ నిర్వహించే అమరావతిరన్నర్స్ అధ్యక్షులు రమేష్ రావి, వారి బృందం సభ్యులు పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ ఇంటర్నేషనల్ స్టేడియమ్ వద్ద ఆ రోజు ఉదయం 5 గంటలకు స్వచ్ఛతా రన్ ప్రారంభమవుతుంది. 5కే, 10కే, 21.1కే (ఆఫ్ మేరాతన్) మూడు కేటగిరీలలో ఈ రన్ ని 'అమరావతి రన్నర్స్' వారు నిర్వహిస్తారు. బాలురు, బాలికలు, యువత ... అన్ని వయసుల వారు పాల్గొనడానికి అవకాశం కల్పిస్తారు. పాల్గొనేవారికి టీషర్ట్స్ తోపాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తారు. అన్ని విభాగాలలో విజేతలకు దాదాపు రూ.10 లక్షల విలువైన బహుమతులతోపాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తారు. పాల్గొన్నవారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ రన్ లో పాల్గొనేవారు ఈ నెల 20వ తేదీ లోపల తమ పేర్లను ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల మంది స్వచ్ఛతా రన్‌లో పాల్గొనే అవకాశం ఉంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వారికి ఆరోగ్యకరమైన జీవనశైలి, పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, సామాజిక కార్యక్రమాలలో పాల్గొనేవిధంగా ప్రోత్సహిస్తారు. విజయవాడలోనే ఇటువంటి రన్ నిర్వహించడం విద్యార్థులకు, యువతకు మంచి అవకాశంగా భావిస్తున్నారు.

## సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా?: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

హైదరాబాద్: తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## దుష్ప్రచారాలు నమ్మొద్దు గణేశ్ నిమజ్జనాలపై హైడ్రా చీఫ్ రంగనాథ్

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## మైనర్ల సోషల్ మీడియా వాడకం... పటిష్ఠమైన రక్షణ అవసరమన్న సుప్రీంకోర్టు

ఢిల్లీ: సోషల్ మీడియా ఖాతాల వినియోగం అంశంలో మైనర్లపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం గురువారం నోటీసులు జారీ చేసింది. భారత కాంట్రాక్ట్ చట్టం ప్రకారం మైనర్లు ఎటువంటి ఒప్పందాల్లోనూ భాగస్వాములు కాలేరని, అలాంటప్పుడు సోషల్ మీడియా ఖాతాలు తెరిచే సమయంలో ఆన్‌లైన్ ఒప్పందాలను వారు ఎలా అంగీకరిస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై సమాధానమివ్వాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ, న్యాయ శాఖలను ఆదేశించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. విచారణలో భాగంగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హెచ్.ఎస్. ఫూల్కా వాదనలు వినిపిస్తూ, అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించడంపై నిషేధం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన జస్టిస్ సూర్యకాంత్, "భారత్‌లోనూ ఇటువంటి రక్షణ చర్యలు అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చి స్పందిస్తూ నియంత్రణ కోసం పటిష్ఠమైన 'ఫైర్‌వాల్స్' ఉండాలని అభిప్రాయపడ్డారు. మైనర్లు సోషల్ మీడియా ఖాతాలను ప్రారంభించడం వల్ల ఆన్‌లైన్ గ్రూమింగ్, లైంగిక వేధింపులు, సైబర్ బుల్లీయింగ్, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి ముప్పులను ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. సోషల్ మీడియా సంస్థలు వయసు నిర్ధారణ కోసం పటిష్ఠమైన యంత్రాంగాన్ని అనుసరించేలా, మైనర్లు సొంతంగా ఖాతాలు తెరవకుండా నిరోధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కాగా, తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండే ఖాతాల ద్వారా విద్యా సంబంధిత కంటెంట్‌ను వీక్షించేందుకు అనుమతించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

అమరావతి: కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## గల్వాన్ తర్వాత తొలిసారి.. మోదీ-జిన్‌పింగ్ భేటీకి రంగం సిద్ధం?

ఢిల్లీ: ఐదేళ్లుగా దూరంగా ఉన్న భారత్-చైనా సంబంధాల్లో కీలక పరిణామం చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశముంది. అదే జరిగితే 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఇద్దరు నేతలు ముఖాముఖి చర్చలు జరపడం ఇదే తొలిసారి అవుతుంది. జిన్‌పింగ్ శనివారం భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఏడేళ్ల తర్వాత ఆయన భారత్‌లో అడుగుపెట్టనున్నారు. ఇటీవల కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులో మోదీ, జిన్‌పింగ్ ఒకే వేదికపై కనిపించి కరచాలనం చేసుకున్నారు. అయితే అప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరగలేదు. ఇప్పుడు బ్రిక్స్ వేదికగా భేటీ జరిగితే ఇరుదేశాల సంబంధాలపై దాని ప్రభావం కీలకంగా ఉండొచ్చు.

సరిహద్దు నుంచి వాణిజ్యం వరకు..

జిన్‌పింగ్ పర్యటనకు ముందు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చైనాలో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. సరిహద్దు వ్యవహారాలపై డబ్ల్యూఎంసీసీ సమావేశం తర్వాత ఇరుదేశాల ప్రత్యేక ప్రతినిధుల చర్చలు కూడా జరిగాయి. తాజా భేటీలో సరిహద్దు సమస్య, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, ఎల్‌ఏసీ వద్ద ఉద్రిక్తతలు మళ్లీ తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అరుణాచల్ ప్రదేశ్.. మరో కీలక అంశం

లడఖ్‌లో ఉద్రిక్తతలు తగ్గినా సరిహద్దు వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా చేస్తున్న వాదనలను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగమని చైనా చెబుతుండగా.. భారత్ దాన్ని పూర్తిగా తిరస్కరిస్తోంది. ఇటీవల అప్పర్ సుబన్‌సిరి ప్రాంతంలో చైనా సైనిక కదలికలపై వచ్చిన నివేదికలు కూడా ఆందోళన పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ-జిన్‌పింగ్ భేటీ జరిగితే సరిహద్దులో శాంతి, స్థిరత్వంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసే అవకాశం ఉంది. అమెరికా సుంకాలు, పశ్చిమాసియాలో అస్థిరత నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను ఎలా ముందుకు తీసుకెళ్లాలన్నదీ చర్చకు రావచ్చు.

## తిరుమల భక్తులకు టీటీడీ భరోసా.. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు!

తిరుపతి: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భక్తుల సంక్షేమం కోసం చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. తిరుమలలో ప్రమాదవశాత్తు మరణించే భక్తుల కుటుంబాలకు అందించే బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అదేవిధంగా, కొండపై సహజంగా మరణించే భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశంలోని ఆలయాల పరిపాలనలో ఇలాంటి పథకం అమలు చేయడం ఇదే తొలిసారని టీటీడీ పేర్కొంది. బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈవో ముద్దాడ రవిచంద్ర పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం కల్పించడమే తమ లక్ష్యమని ఛైర్మన్ మీడియాకు తెలిపారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్, సీఎం పర్యటన

సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. సెప్టెంబర్ 15న ఉత్సవాల ప్రారంభం రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. సెప్టెంబర్ 16న రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను ఆయన ప్రారంభించడంతో పాటు, టీటీడీ 2027 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు.

భారీ ఏర్పాట్లు, భద్రత

గతేడాదితో పోలిస్తే ఈసారి గరుడ సేవ రోజున 15-20 శాతం అధికంగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా రోజుకు 10 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా సిద్ధం చేస్తున్నారు. అన్నప్రసాదం ఏర్పాట్లను కూడా గతేడాది 6.13 లక్షల భోజనాల నుంచి ఈసారి 9.30 లక్షలకు (52% పెరుగుదల) పెంచారు. భద్రతాపరంగా 3,000 మంది పోలీసులు, 2,500 మంది టీటీడీ విజిలెన్స్ సిబ్బందిని మోహరిస్తున్నారు. పారిశుద్ధ్యం కోసం అదనంగా 3,300 మంది సిబ్బందిని నియమించారు. తిరుపతి నగరంలో ప్రత్యేక హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా భక్తులను తిరుమలకు తరలించనున్నారు. ఈ సమావేశంలో పాలకమండలి మరికొన్ని కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని రిటైర్డ్ సీపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లకు వర్తింపజేయడం, అన్నప్రసాదం వ్యర్థాలతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు, నారాయణవనం, చెన్నైలోని శ్రీవారి ఆలయాల్లో బంగారు తాపడం పనులకు ఆమోదం తెలిపారు. యాత్రకు వచ్చి అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ఈ కొత్త బీమా పథకాలు అండగా నిలుస్తాయని టీటీడీ విశ్వాసం వ్యక్తం చేసింది.

నేటి శుభోదయ

జనరల్ న్యూస్

శుక్రవారం - 11 - సెప్టెంబర్ - 2026

## రిలయన్స్ స్మార్ట్‌లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై తనిఖీ



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం మొగల్రాజపురంలోని రిలయన్స్ స్మార్ట్‌ను రీజినల్ ఫైర్ ఆఫీసర్ తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రీజినల్ ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ, రిలయన్స్ స్మార్ట్ యాజమాన్యం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (చీఓజ) కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో చీఓజ జారీ చేయడానికి ఆస్కారం లేదని తెలిపారు. తనిఖీల్లో అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని అగ్నిమాపక భద్రతా పరికరాలు పనిచేయడం లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు.అధిక జనసాంద్రత ఉండే వాణిజ్య ప్రదేశాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనిచేయని అగ్నిమాపక పరికరాలను వెంటనే మరమ్మతు చేసి, అన్ని భద్రతా ఏర్పాట్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి యాజమాన్యానికి రెండు రోజుల సమయం ఇచ్చినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా అన్ని అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను, పరికరాలను సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకున్న అనంతరం మాత్రమే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల ఏర్పాట్లపై వియంసి కమిషనర్ ధ్యానచంద్ర సమీక్ష సమావేశం



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-రానున్న పురపాలక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ, అందిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, వాటిపై తీసుకున్న చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు అందిన అభ్యంతరాల వివరాలను పరిశీలించి, వాటిపై నిబంధనల ప్రకారం తీసుకున్న చర్యలను కమిషనర్ సమీక్షించారు. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రతి వార్డుకు అవసరమైన పోలింగ్ కేంద్రాల సంఖ్యను గుర్తించి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. 2021లో నిర్వహించిన పురపాలక ఎన్నికల సమయంలో అనుసరించిన విధానాలు, ఏర్పాట్లను పరిశీలించి, ప్రస్తుత ఎన్నికలకు కూడా అవసరమైన మేరకు వాటిని అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అదనంగా అవసరమైన సౌకర్యాలు, ఏర్పాట్లు ఏమైనా ఉంటే వాటిని ముందుగానే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం 64 డివిజన్ల సభ్యుల సామర్థ్యానికి అనుగుణంగా ఉన్న కౌన్సిల్ హాల్‌ను, డీలిమిటేషన్ నేపథ్యంలో లో 86 వార్డుల సభ్యులకు అనుగుణంగా మార్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఇందుకు ఇంజనీరింగ్ విభాగం, సెక్రటరీ సెల్ అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన మార్పులు, సౌకర్యాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్ బాబు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస్, సెక్రటరీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-నగరంలో ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, దోమల నివారణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌కు సమీపంలోని సమావేశ మందిరంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రజారోగ్య పరిస్థితులు, పారిశుద్ధ్య నిర్వహణ, వర్షాకాలంలో చేపడుతున్న దోమల నివారణ చర్యలపై సమీక్షించారు.నగరంలోని ఆసుపత్రుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగరంలోని ప్రతి ఆర్వో ప్లాంట్‌ను ప్రతి నెలా తప్పనిసరిగా నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించాలని వాటిని క్రమ తప్పకుండా అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే బరియల్ గ్రౌండ్స్, పార్కులు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, పరిశుభ్రత ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో మలేరియా, ఇతర దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిరంతరాయంగా ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్, వ్యర్థాల తొలగింపు, డ్రైన్లలో పూడికతీత వంటి కార్యక్రమాలను చేపట్టి దోమల వృద్ధికి అవకాశం లేకుండా చూడాలని సూచించారు. ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ పి. అన్నపూర్ణ, డాక్టర్ ఎన్. గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దేవిన హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నగర పరిధిలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఎస్టేట్, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం నగరంలో శిథిలావస్థలో ఉన్న ప్రైవేట్, పబ్లిక్ భవనాల పరిస్థితిపై అధికారులతో సమీక్షించిన కమిషనర్, నిర్మాణపరంగా స్థిరత్వం లేని, ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం సీజ్ చేయడంతో పాటు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో నిర్మాణ స్థిరత్వం లేని, నివాసానికి లేదా వినియోగానికి సురక్షితం కాని భవనాలను సమగ్రంగా గుర్తించి, వాటిలో నివసిస్తున్న లేదా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వీఎంసీ పరిధిలోకి రాని, ఇతర ప్రభుత్వ శాఖలు లేదా సంస్థల పరిధిలో ఉన్న ప్రమాదకర భవనాలకు సంబంధించి ఆయా శాఖలకు వెంటనే లేఖలు రాసి, భవనాల పరిస్థితిని తెలియజేయడంతో పాటు అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి, అవసరమైన చర్యలు చేపట్టేలా సమన్వయం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.అదేవిధంగా విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన ఎస్టేట్ ఆస్తుల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని వెంటనే తొలగించేందుకు (డిమాలిషన్) చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా శిథిలావస్థలో ఉన్న భవనాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ సమావేశం



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-రానున్న వినాయక చవితి, గణేష్ నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ ఛాంబర్ లో గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, తదితర అంశాలపై చర్చించారు. ఉత్సవ కమిటీలు, నగరపాలక సంస్థ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలను సజావుగా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ జనరల్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజలు, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి ఎన్‌టీఆర్ జిల్లా కార్యాలయ ప్రముఖ్, జాయింట్ సెక్రటరీ జి.వి.ఎస్. రమణమూర్తి, విజయవాడ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు యెండూరి కిషోర్, ఉపాధ్యక్షులు వి. కృష్ణమోహన్, కార్యదర్శి వి. పల్లపరాజు పాల్గొన్నారు.

## వినాయకుని నిమజ్జనానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):- వినాయక చవితి సందర్భంగా నగరంలో నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కమిషనర్ నగరంలోని ఎంజీ రోడ్ పోలీస్ కంట్రోల్ రూమ్, తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్, వినాయక టెంపుల్ రోడ్, సీతమ్మవారి పాదాలు, భవానీపురం హెడ్ వాటర్ వర్క్స్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బీ కాలనీ, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు.సీతమ్మవారి పాదాల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉండాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జనానికి అవసరమైన వాహనాలు, క్రేన్లు, లైటింగ్, పారిశుద్ధ్య సిబ్బంది, తదితర మౌలిక వసతులను సమకూర్చడంతో పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ పర్యావరణహితంగా నిర్వహించాలని కమిషనర్ కోరారు. ముఖ్యంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిమజ్జన సమయంలో నగర పారిశుద్ధ్యానికి ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం హెచ్‌బీ క్యాంటీన్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అక్కడ పారిశుద్ధ్య పరిస్థితులు, ఆహార నాణ్యత, ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో అందేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఎన్.శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో విస్తృత తనిఖీలు.

### బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించని 8 సంస్థలకు నోటీసులు



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ నిర్మల గ్లోరీ సూచనల మేరకు, 40వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, సిబ్బందితో కలిసి గురువారం డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా భవానిపురం, క్రాంబే రోడ్ ప్రాంతాలలో గల ఆసుపత్రులు, క్లినిక్‌లలో బయో మెడికల్ వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, నిల్వ చేయడం, తరలింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు పాటించని కేబి డయాగ్నసిస్ సెంటర్, తులసి క్లినిక్, సాయి నర్సింగ్ హోమ్, ఆల్మట్టి నర్సింగ్ హోమ్, భవాని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆర్కే డయాగ్నస్టిక్ సెంటర్, భయపరెడ్డి క్లినిక్, ఎమ్రిన్ ఆసుపత్రులకు బయో మెడికల్ వేస్ట్ రూల్స్, 1998 మరియు ా.ా. చీశీ. 630(జు) ప్రకారం నోటీసులు జారీ చేశారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఆసుపత్రి, క్లినిక్ బయో మెడికల్ వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే ప్రదేశంలోనే తప్పనిసరిగా వేరు చేయాలని అధికారులు సూచించారు. నిబంధనల ప్రకారం పసుపు, ఎరుపు, తెలుపు, నీలం రంగుల కేటగిరీలకు అనుగుణంగా వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి, వాటిని అధీకృత (జదీఔఖీ) ద్వారా మాత్రమే శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణకు తరలించాలని స్పష్టం చేశారు.బయో మెడికల్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్ల ప్రజారోగ్యానికి, పారిశుద్ధ్యానికి, పర్యావరణానికి హాని కలిగే అవకాశం ఉన్నందున, సంబంధిత నిబంధనలను ప్రతి ఆసుపత్రి, క్లినిక్ తప్పనిసరిగా పాటించాలని అధికారులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని ఆసుపత్రులు, క్లినిక్‌లలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సర్కిల్-1 శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రజారోగ్యం సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న మహిళలకు స్వయం ఉపాధికల్పించడమే లక్ష్యం ఎమ్మెల్యే బొండా ఉమా, బొండా సిద్ధార్థ




విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్ నగర్‌లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం 62వ డివిజన్ ప్రకాష్ నగర్‌కు చెందిన గొర్రెల రాణి కు స్వయం ఉపాధి నిమిత్తం ఎఊా ఎలక్ట్రిక్ ఆటోను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ చేతుల మీదుగా అందజేశారు.రాణి తన కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించి, జీవనోపాధి కోసం ఆటో అందజేయాలని ఎమ్మెల్యే బొండా ఉమాను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆమెకు స్వయం ఉపాధి కల్పించేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. బొండా సిద్ధార్థ మార్గదర్శకత్వంలో రూ.25,000 డౌన్ పేమెంట్ చెల్లించి ఎలక్ట్రిక్ ఆటోను అందించేలా సహకరించారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు.కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని, మాటలు చెప్పడం మాత్రమే కాకుండా ఆచరణలో పనులు చేసి చూపించడమే తమ విధానమని ఉమా పేర్కొన్నారు. అవసరమైన వారికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలు మరింత బలోపేతం అవుతాయని, అందుకే మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ సందర్భంగా ఆటో అందుకున్న రాణి మాట్లాడుతూ తన కుటుంబ పరిస్థితులను అర్థం చేసుకుని స్వయం ఉపాధి కోసం ఆటోను అందించిన బొండా ఉమా కు, బొండా సిద్ధార్థ కు, సహకరించిన ప్రతి ఒక్కరికీ తన కుటుంబం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, 62వ డివిజన్ ఇంచార్జ్ పైడి శ్రీను, పాస్టర్ శామ్యూల్, ాని గౌసియా, ాని జాన్ వలి, ఫర్వీన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలి



విజయవాడ నేటి శుభోదయ 10 సెప్టెంబర్: కాపులకు 5 శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని సిఎం చంద్ర బాబు నాయుడు కి కాపు ఉద్యమ నేత వేల్పూరి శ్రీనివాసరావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వర్గాల కి విద్యా, ఉద్యోగ అవకాశాలు లో కల్పించిన 10 శాతం లో, 5 శాతం కోటా ని కాపుల కి ఇవ్వాలని రాష్ట్ర అసెంబ్లీ లో 2019 లో ఏకగ్రీవంగా తెలుగుదేశం చేసిన తీర్మానాన్ని వెంటనే అమలు చేయాలని సిఎం చంద్ర బాబు నాయుడు కి కాపు పొలిటికల్ జేఏసీ చైర్మన్ వేల్పూరి శ్రీనివాసరావు రాసిన బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కాపులకి ఇచ్చిన ఐదు శాతం రిజర్వేషన్ జగన్ గవర్నమెంట్ రాగానే తీసేసిందని ఇది అన్యాయం అని ఆయన పేర్కొన్నారు. గత 75 సంవత్సరాల నుండి కాపుల ను అనేక ప్రభుత్వాలు సిఎం లు పూర్తిగా మోసం చేశారని , ముఖ్యంగా ఉద్యోగ రంగంలో గ్రూప్..1 నియామకాలు లో కాపు లకు రాజశేఖర రెడ్డి, వైయస్ జగన్ హయాంలో పూర్తిగా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కాపు విద్యార్థులకు , ఇంటర్వ్యూ లో అతి తక్కువ మార్కులు వేసి మోసం చేసి, తమ వారికి తక్కువ మార్కులు వచ్చినా కీలకమైన డిఎస్పి, ఆర్. డి. ఒ. పోస్టు లు ఇచ్చారు అని చెప్పారు. హై కోర్టు కాపు లకు రిజర్వేషను ఇవ్వాలని చెప్పినా, ఇవ్వకుండా రాజశేఖర రెడ్డి మోసం చేస్తే, జగన్ మాత్రం రిజర్వేషను అడిగిన కాపు యువకులు మీద ముద్రగడ పద్మనాభం సొంత గ్రామం లో దాడులు చేశారు అని అన్నారు. కాపు రిజర్వేషను లు అడ్డు కోవడం కోసం రాజశేఖర రెడ్డి, జగన్ లు కోర్టు లో తప్పుడు కేసులు వేయించి, కాపు లకు నమ్మక ద్రోహం చేశారని శ్రీనివాస్ పేర్కొన్నారు .1956 లో మొదటి సారిగా సిఎం నీలం సంజీవరెడ్డి కాపు, బలిజ లను అకారణంగా ఒక్క కలం పోటు ద్వారా బిసి జాబితాలో ఉన్న బలిజ..కాపు లను తొలగించి మహా నేరం చేశారు అని లేఖలో వివరించారు.

## ప్రతి వినాయక మండపం వద్ద ఫైర్ సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-వినాయక చవితి సందర్భంగా నగరంలోని ప్రతి వినాయక మండపం వద్ద భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించి, నగరంలోని వినాయక మండపాల వద్ద భక్తుల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, విద్యుత్ భద్రత, మండపాల స్థిరత్వం తదితర అంశాలపై సమీక్షించారు.ప్రతి వినాయక మండపం వద్ద 200 లీటర్ల నీటి డ్రమ్ముతో పాటు ఇసుక, జూ2, డ్రై కెమికల్ పౌడర్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసే లైటింగ్, డెకరేషన్, విద్యుత్ కనెక్షన్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, వైర్లు లూజుగా వేలాడకుండా, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు మండపాల స్టేజ్‌ల స్థిరత్వాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం అధికారులు సూచించే భద్రతా చర్యలకు నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా సహకరించాలని కోరారు. అలాగే పూజ అనంతరం వెలువడే పూల వ్యర్థాలు, ఇతర పూజా సామగ్రి కోసం మండపాల వద్ద ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, వ్యర్థాలను తడి, పొడి మరియు పూల వ్యర్థాలుగా వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పూల వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా అగరబత్తీలు, ధూప్‌స్టిక్స్ తదితర ఉత్పత్తుల తయారీకి వినియోగించేలా నగరపాలక సంస్థకు అందించాలని కమిషనర్ తెలిపారు.వినాయక మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావును నోడల్ అధికారిగా నియమించి, సంబంధిత శాఖల మధ్య సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, రత్నబాబు, ఎస్ఎఫ్ఓ నరేష్ పాల్గొన్నారు.

## మైలవరం లో పేదల వైద్యానికి రూ.25.19 కోట్ల ఆర్థిక సాయం

**1,957 మందికి రూ.11.71 కోట్ల సీఎంఆర్ఎఫ్ రీయింబర్స్‌మెంట్ చెక్కులు.**

**744 మందికి రూ.13.48 కోట్ల ఎల్.ఓ.సిలు.ఎమ్మెల్యే వసంత**



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైలవరం నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.25.19 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాదు తెలిపారు.ముఖ్యమంత్రి సహాయనిధి కింద 1,957 మందికి రూ.11,71,00,811 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా చికిత్స కోసం ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తానికి సంబంధించి 744 మందికి రూ.13,48,25,986 విలువైన ఎల్.ఓ.సిలు చెల్లించినట్లు వెల్లడించారు. ఈ రెండు విభాగాల్లో కలిపి ఇప్పటివరకు రూ.25,19,26,797 మేర ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు.విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎల్.ఓ.సీలు, సీఎంఆర్ఎఫ్ రీయింబర్స్‌మెంట్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు మైలవరం నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు."ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మైలవరం నియోజకవర్గానికి ఈ స్థాయిలో ఆర్థిక సహాయం అందుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని ఎమ్మెల్యే తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నామని, అవసరమైన సందర్భాల్లో సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించి తగిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.మైలవరం నియోజకవర్గంలో ఇప్పటివరకు పేదల వైద్యసేవల నిమిత్తం రూ.25.19 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం అందడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య భరోసాకు నిదర్శనమని వసంత కృష్ణ ప్రసాదు పేర్కొన్నారు.

## వాట్సాప్ గవర్నెర్స్‌ను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, సెప్టెంబర్ 10 (నేటి శుభోదయ):-ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వినూత్నంగా ఆలోచించి ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెస్ విధానాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకుని వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పులోని 14వ డివిజన్ కు చెందిన సకలమూడి రాజేశ్వరికి జీవనోపాధి నిమిత్తం రూ.25 వేలు విలువ చేసే బడ్డీ కొట్టును ఎమ్మెల్యే గద్దె తన సొంత నిధులతో కొనుగోలు చేసి ఆమెకు ఉచితంగా అందచేశారు.ఎఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ నగర్‌లో పర్యటించి అనేక సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో దేవాదాయ శాఖకు చెందిన ఏడు ఎకరాల భూమి ఉందని, యువకులు ఈ ప్రాంతంలో చేరి గంజాయి సేవిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తాను పోలీసుల దృష్టికి తీసుకువెళ్ళానని వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టంగా చెప్పానన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో గంజాయిని పండించి, విక్రయించేవారని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎకరం స్థలంలో కూడా గంజాయి సాగు చేయకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. కాని పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయిని కొంత మంది యువకులు రహస్యంగా తీసుకువస్తున్నారని అన్నారు. గంజాయి తాగి స్థానికంగా ఏమైనా ఇబ్బందులు సృష్టిస్తే, అదే వారికి ఆఖరి రోజు అవుతుందన్నారు. ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు తాను చర్యలు తీసుకుంటానని చెప్పారు. పెన్షన్ దరఖాస్తు చేసుకునేందుకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొంత మంది తనకు చెప్పారని కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ దృష్టికి ఈ విషయాలను తీసుకువెళ్ళి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. అదే విధంగా డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు తనకు తెలియజేశారని ఇంటి ముందు ఉన్న డ్రైయిన్‌ను పూడ్చి అరుగులు, ఇతర నిర్మాణాలు చేయడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఫోటో తీసి తనకు వాట్సాప్ చేయడం ద్వారా వెంటనే ఆ సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యను తెలియజేసిన 24 గంటల వ్యవధిలో పరిష్కారం చేస్తామన్నారు. వాట్సాప్ గవర్నెస్ అనే వినూత్న విధానాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఏర్పాటు చేశారని, ఈ విధంగా ఎన్నో సమస్యలు పరిష్కరించామన్నారు. రాధారపు యల్లబాబు మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలకు ఎమ్మెల్యే గద్దె తన సొంత నిధులతో ఇస్త్రీ పెట్టెలు, బడ్డీకొట్లు, తోపుడు బండ్లు అందచేస్తున్నారన్నారు.బిజేపీ నాయకుడు పోతంశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్‌లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ స్వయంగా పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారని చెప్పారు. నివాసాల మధ్య ఉన్న దేవాదాయ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో యువకులు గంజాయి సేవించి గలాటా సృష్టిస్తున్నారని స్థానికులు తెలియజేయడంతో వెంటనే ఆయన అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, కర్ణ రమేష్, కిలారు శ్రావణి, గరికపాటి బద్రి, డాంగేకుమారి, యడ్లపల్లి నాగరాజు, అనుముల కృష్ణారావు, రేపాకుల ప్రసాద్, షేక్ ఫాతిమా, కర్ణ కోటేశ్వరరావ, చిట్టా నిర్మల, వెంకట్రావ్, కొండల నాయుడు, గళ్ళా రవి తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు రూ.1 కోటి నిధులను మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం

**సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు తక్షణం పెండింగ్ నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబుకు , లేఖ ద్వారా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో తక్షణం రూ. 1కోటీ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**సి ఎం చంద్రబాబుకు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు,మంత్రి నారా లోకేష్ బాబు కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే సింధూర రెడ్డి**



అనంత పురం సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు రూ.1 కోటి నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. నియోజకవర్గంలోని ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు ఎంతో కీలకమని ఎమ్మెల్యే సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,మంత్రి నారా లోకేష్ బాబు గారి దృష్టికి తీసుకెళ్లగా,వారు వెంటనే స్పందించి తక్షణం ఈ ప్రాజెక్టుకు రూ.1 కోటి నిధులను మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కూటమి ప్రభుత్వానికి ,సీఎం,డిప్యూటీ సీఎం,నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఏ పల్లె సింధూర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలిపారు. సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు, సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే సింధూర రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ,ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 20 మందికి రూ.17.82 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన దగ్గుపాటి

**గత ఐదేళ్లలో 80లక్షలు కూడా ఇవ్వలేదన్న ఎమ్మెల్యే**

**కరవు ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చారన్న ఎమ్మెల్యే**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 10 నేటి శుభోదయ : గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టులు కూడా భర్తీ చేయని నాయకులు.. ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 35వ విడత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 20 మందికి 17 లక్షల 82వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు 713 మందికి 7కోట్ల 12లక్షల రూపాయల మేర ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కేవలం రెండేళ్లలోనే ఇంతమందికి సాయం చేశామని.. అయితే గత వైసీపీ పాలనలో కనీసం 80 లక్షల రూపాయలు కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించలేదన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి వెళ్లిపోతే.. కేవలం ఏడాదిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టారన్నారు. ఓవైపు మంత్రి నారా లోకేష్ ఇంకోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలన రాష్ట్రానికి 25 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో రాయలసీమ అంటే కరవు ప్రాంతంగా చెప్పుకునే వారని ఇప్పుడు అదే ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ హబ్ గా మార్చారన్నారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు ప్రతిష్టాత్మక కంపెనీలు తీసుకొచ్చారన్నారు. పుట్టపర్తి ప్రాంతానికి లక్ష కోట్ల పెట్టుబడితో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకంతోనే 16,347 పోస్టుల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను 148 రోజుల్లో పూర్తి చేశారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లో పిల్లలు చేరే విధంగా మార్పులు తీసుకొచ్చారన్నారు. గతంలో ఉపాధ్యాయులను బాత్రూంల వద్ద, వైన్ షాపులు వద్ద ఉంచి అవమానించిన వైసీపీ వారు ఈరోజు మెగా డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారన్నారు. అసలు వారికి డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హంద్రీనీవా గతంలో కేవలం 1800 క్యూసెక్కులు మాత్రమే ఉండేదని.. ఇప్పుడు ఏకంగా 4వేల క్యూసెక్కులకు పెంచి శ్రీశైలం నుంచి నీరు తీసుకొస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 250 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌళిక వసతులు కల్పించామన్నారు. రానున్న రోజుల్లో మరో 310 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.

## విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు అనువర్తనాలపై పాఠ్యపుస్తకం ప్రచురణ



అనంతపురం సెప్టెంబర్ 10 నేటి శుభోదయ : విద్యుత్ ఇంజినీరింగ్ రంగంలో కృత్రిమ మేధస్సు సాంకేతికత వినియోగంపై "విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు అనువర్తనాలు" పేరుతో రూపొందించిన పాఠ్యపుస్తకాన్ని డా. జి. శ్రీనివాసన్, డా. బి. హరిప్రసాద్ రచించారు.విద్యుత్ ఇంజినీరింగ్ రంగం వేగంగా ఆధునిక సాంకేతికత వైపు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కృత్రిమ మేధస్సు ఆధారిత సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు రచయితలు తెలిపారు. విద్యుత్ వ్యవస్థల పర్యవేక్షణ, లోపాల గుర్తింపు, విద్యుత్ డిమాండ్ అంచనా, విద్యుత్ వ్యవస్థల విశ్లేషణ, స్వయంచాలకీకరణ, స్మార్ట్ గ్రిడ్ వంటి ఆధునిక రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ పుస్తకాన్ని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆవిష్కరించిన సందర్భంగా కళాశాల చైర్మన్ డా. క్రిష్ణ కిషోర్, ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ బాబు, మేనేజ్‌మెంట్ రిప్రజెంటేటివ్ కె. శ్రీకాంత్ రెడ్డి, ఈఎం శ్రీ అనురాగ్ రెడ్డి, ఏఓ డా. కె. మనోహర్ రెడ్డి రచయితలను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ డా. క్రిష్ణ కిషోర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం సంప్రదాయ ఇంజినీరింగ్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రస్తుతం పరిశ్రమల్లో వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, స్వయంచాలకీకరణ వంటి ఆధునిక సాంకేతికతలపై కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా సంస్థల్లో ఇటువంటి పుస్తకాలు, పరిశోధనాత్మక రచనలు వెలువడటం విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదికే పరిమితం చేయకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక నైపుణ్యాలను అందించడమే లక్ష్యంగా సంస్థ పనిచేస్తోందన్నారు. విద్యుత్ ఇంజినీరింగ్‌తో కృత్రిమ మేధస్సు సాంకేతికతను అనుసంధానం చేసే అంశాలపై రూపొందిన ఈ పుస్తకం విద్యార్థులు, అధ్యాపకులకు ఉపయోగకరమైన విద్యా వనరుగా నిలుస్తుందని పేర్కొన్నారు.రచయితలు డా. జి. శ్రీనివాసన్, డా. బి. హరిప్రసాద్ మాట్లాడుతూ, విద్యుత్ ఇంజినీరింగ్‌లో కృత్రిమ మేధస్సు వినియోగానికి సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు, ఆధునిక అనువర్తనాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలకు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థుల్లో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి పెంచడం ఈ పుస్తక ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు.పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బోధనతో పాటు పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన విద్యను ప్రోత్సహించే దిశగా ఇటువంటి విద్యా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది.

## రైతు వ్యతిరేక చట్టాలపై రైతు ఉద్యమం

**– కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలతో రైతు మనుగడ ప్రశ్నార్థకం**

**– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఆందోళన**

**ఎల్ ని నో ప్రభావంతో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం డిమాండ్**



ఉంగుటూరు (కైకరం) సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం లోని గుత్తికొండ వారి సత్రం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలపై రైతాంగం చారిత్రాత్మక ఉద్యమం చేశారని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేసి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ఈ ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నాయని, దీనితో రైతు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ల నియంత్రణ చట్టం, సహకార చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాల చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా పథకం, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ ఇలా అనేక చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చి వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎకరాలు రాష్ట్రంలో భూ సేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టాలని చూస్తోందని, బలవంతపు భూసేకరణ వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు.ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పాడిపశువులకు సబ్సిడీపై దాణా అందించాలని కోరారు. కోకో,కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై దశల వారి ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, లావేటి సోంబాబు, బోడిక రామచంద్ర రావు, దాసరి సతీష్, వీరవల్లి భాస్కరరావు, సున్నా వెంకట్రావు, గుండపనేని సురేష్,కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# "స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ సన్నద్ధం

**పడమర విప్పర్రులో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ వైసిపి ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు"**



పెంటపాడు సెప్టెంబర్ 10 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్థానిక సంస్థలు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. పెంటపాడు మండలం పడమర విప్పర్రు గ్రామంలో బోనం వారి కళ్యాణ మండపంలో గురువారం స్థానిక సంస్థలు ఎన్నికలపై పెంటపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా వడ్డీ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. ఎక్కడ కూడా గ్రూపు రాజకీయాలు లేకుండా సమన్వయంతో స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నడవాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు హితబోధ చేశారు. వైసీపీ పార్టీ చాలా బలంగా ఉందని ఇటువంటి సమయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూటమి ప్రభుత్వం పనితీరుపై రాష్ట్ర ప్రజలు విరక్తి చెందరన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ప్రజలు గమనిస్తున్నారని ఎప్పుడు ఎలక్షన్స్ వచ్చిన ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మోసపూరిత హామీలు నమ్మి మోసపోయామని బాధపడుతున్నారన్నారు. వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అభివృద్ధిని ప్రక్కన పెట్టి సంపాదనే ధ్యేయంగా కూటమి నాయకులు పనిచేస్తున్నారని మండిపడ్డారు. నేను కక్కిన కూడు తినే అవసరం నాకు లేదని వైఎస్ఆర్సిపి కార్యకర్త తల ఎత్తుకొని తిరిగేలా చేసే బాధ్యత నేను తీసుకుంటానని, వైఎస్ఆర్సిపి జెండా మోసే ప్రతి కార్యకర్తను నేను భుజాలపై మోస్తానని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మళ్ళీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంబాగుపడతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు.గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకోవడంతో పాటు, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్సిపి గ్రామ సీనియర్ నాయకులు కోసూరి వెంకటరాజు, కోసూరు చంటి రాజు, పెంటపాడు మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, పడమర విప్పర్రు మాజీ ఉపసర్పంచ్ బోనం వీరయ్య, తెంటూ గోపి, సంపత్ రావు కృష్ణారావు, వైయస్సార్సీపి పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, కలిశెట్టి తాతారావు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పెంటపాడు గ్రామ అధ్యక్షులు బర్ల జయరాంబాబు, లంకా రాజశేఖర్, మొఖమట్ల శ్రీనివాస్, రూరల్ మండల అధ్యక్షులు చిట్టూరి బాపన్న, నల్లమిల్లి విజయానంద రెడ్డి, బండి నరసింహా, తానేటి అజయ్, గోకా వెంకటేశ్వరరావు, బూడి దుర్గా ప్రసాద్, ద్వారంపూడి కిరణ్ కుమార్ రెడ్డి, చామన సూర్యచంద్రరావు, కునుకు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముర్రం దూలయ్యకు ఘనంగా నివాళులర్పించిన సిపిఎం జిల్లా కార్యదర్శి బప్పెన కిరణ్



చింతూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: ఉపాధ్యాయ వృత్తిలో తనకంటూ ఒక నిబద్ధత క్రమశిక్షణతో చింతూరు ఏజెన్సీ మన్నె ప్రాంతంలో ఎంతోమందికి విద్యాభ్యాసం అందించిన ముర్రం దూలయ్య మాస్టారు చిత్రపటం వద్ద రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ జిల్లా మండల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎర్రం పేట గ్రామంలో ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని కిరణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని చేసుకుంటూ సంఘంలో కూడా చురుకుగా కార్యక్రమాలను నిర్వహించే వారిని తన జీవితకాలం అంతా కూడా ఏజెన్సీ ప్రాంతంలో విద్యను అందించే క్రమంలో నిబద్ధతగా వ్యవహరించారని కొనియా డారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పల్లపు వెంకట్. సీసం సురేష్. మొట్టం రాజయ్య. సున్నం రాజులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పంద కృష్ణయ్య. సుందరయ్య, సుబ్బారావు, కుటుంబ సభ్యులు ముర్రం రంగమ్మ, కవిత, రవి, ఉపాధ్యాయ సంఘాల వారు బంధువులు పాల్గొన్నారు.

## నిరంతర వైద్య విజ్ఞాన సదస్సుకు ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి హాజరు



చింతూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: పారంపర్య వైద్య విధానాల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు వైద్య విజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పారంపర్య వైద్య మహా సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అందరివాడు, అడవిదేవుడు, పివిఎంఎస్ వైద్యరత్న వైద్య శ్రీ జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి హాజరయ్యారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి ని నిర్వాహకులు, వైద్యులు,పారంపర్య వైద్య నిపుణులు ఘనంగా సత్కరించారు. పారంపర్య వైద్య విధానాలను పరిరక్షించడంతో పాటు, ఆధునిక వైద్య విజ్ఞానంతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని



కార్యక్రమంలో పేర్కొన్నారు.పారంపర్య వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న వైద్యులు, నిపుణులు, ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని వైద్య విజ్ఞానానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో పారంపర్య వైద్య మహా సంఘం ప్రతినిధులు, వైద్యులు, వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## "పేదలకు ఇళ్ల స్థలాలు మరియు ఇండ్లు నిర్మించి తక్షణమే ఇవ్వాలి సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి గోపాలం"




పెంటపాడు సెప్టెంబర్ 10 (నేటి -శుభోదయ) పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి గోపాలం అన్నారు. గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి అనంతరం స్థానిక ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ సెంటర్ నుండి స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శాసనసభ్యులకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్వి గోపాలం, పెంటపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో గోగులమ్మ గుడి వద్ద నుండి పీహెచ్సి సెంటర్ వరకు గత 50 సంవత్సరాల నుంచి ఇల్లు నిర్మించుకున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ముదునూరు శివారు అరుంధతి పేట లో నివసిస్తున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మరియు గత 30 సంవత్సరాల నుండి పెంటపాడు గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంపై పెంటపాడు గ్రామంలో ఉన్న లబ్ధిదారులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అనేక సార్లు అధికాలకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదన్నారు. ఇప్పటికైె వీరి సమస్యలు పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక శాసనసభ్యులు బొలిసెట్టి శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు. శాసనసభ్యులు బొలిశెట్టి సానుకూలంగా స్పందించి పెంటపాడు గ్రామంలో ప్రభుత్వం భూములు లేవని ప్రైవేట్ ల్యాండ్ కొనాలంటే డబ్బుతో కూడుకున్న వ్యవహారమని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్వి గోపాలం మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకున్న పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఇంటి పట్టాలు ఇవ్వాలని, ముదునూరు శివారు అరుంధతి పేటకు సంబంధించి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, పెంటపాడు గ్రామంలో గత 30 సంవత్సరాలు నుండి ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ప్రైవేట్ ల్యాండ్ కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, వడ్డీ సత్యనారాయణ, నేతల వెంకటలక్ష్మి, బర్ల బాలాజీ, పెనగంటి దుర్గ, కర్రీ సాయి రెడ్డి, మద్దాల సత్యనారాయణ మరియు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గుడివాడలో 25 కుటుంబాలకు రూ.10.70 లక్షల సీఎంర్ఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-కూటమి హయాంలో గుడివాడలో రూ.7.11 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ:ఎమ్మెల్యే

-కష్టాల్లో ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు మద్దతుగా నిలవాలి:ఎమ్మెల్యే రాము

-కూటమి ప్రభుత్వంలో తక్షణ సహాయం అందుతోంది: లబ్ధిదారులు



గుడివాడ సెప్టెంబర్ 10 నేటి శుభోదయ : కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయంగా ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.నియోజకవర్గ పరిధిలోని 25 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.10.70లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ కష్టకాలంలో ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. "కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే ఇప్పటివరకు రూ.7.11 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాదు కోట్లాది రూపాయల ఎల్ఓసిలు కూడా మంజూరు చేయించామని ఎమ్మెల్యే రాము చెప్పారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ ఫైళ్లు పెండింగ్‌లో ఉండేవని, కానీ ఇప్పుడు దరఖాస్తులు వచ్చిన వెంటనే పరిష్కరించి తక్షణ సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పిన్నమనేని బాబ్జి, బొంబాయి శ్రీను, యార్లగడ్డ సుధారాణి,సీతయ్య, సింగాల రాధాకృష్ణ,పులవర్తి డేవిడ్, గుత్తా చంటి, కొడాలి రాజా, పైడిముక్కల వంశీ, ద్వారక, కోడూరి ప్రభు, మల్లికా బేగం,కర్ణాకర్ రావు, కమలయ్య, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## వైద్య విద్యార్థినికి ఐ టి డి ఏ పి ఓ ప్రశంసలు



చింతూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: చింతూరు ఐటీడీఏ పీవో ,శుభం నొక్వాల్ తన కార్యాలయంలో ఇటీవల నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించి, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ గుంటూరు లో ఎంబీబీఎస్ సీట్ సాధించిన కుమారి. కాక వర్షిణి ప్రియ ను పిలిపించి మాట్లాడారు . ఎంబీబీఎస్ సీటుసాధించినందుకు ప్రశంసించారు.'ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం నిరుపేదలకు మరింత చేరువ చెయ్యాలంటే ఏ విధమైన సూచనలు ఇవ్వగలరు ' అని అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ ప్రాంతంలో మెరుగైన వైద్యసేవలు అందించుటకు.. నా వంతు కృషి చేస్తానని వర్షిణి ప్రియ హామీ ఇచ్చారు. అనంతరం వర్షిణి ప్రియను ప్రాజెక్ట్ అధికారి దుస్సాలువతో సన్మానించి, ప్రతిస్టాత్మక "చింతూరు సేవా సమ్మాన్" పురస్కారంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో రామతులసి గారు,తల్లిదండ్రులు కాక రాజు,పూజిత, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కణితి శేఖర్,రాష్ట్ర నాయకులు సోడే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహితీ మకుటం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

ఘనంగా కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి వేడుకలు



ఒంగోలు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: తన అద్భుతమైన రచనలతో తెలుగు సాహిత్యానికి మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు సాధించిపెట్టిన కవిశ్రేష్టుడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 131వ జయంతి వేడుకలను సంస్కార భారతి ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీమద్రామాయణ కల్పవృక్ష కావ్యానికి జ్ఞానపీఠ్ అవార్డు సాధించి, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అవార్డు పొందిన సాహితీ దిగ్గజం విశ్వనాథ సత్యనారాయణ అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. వేయి పడగలు, ఏకవీర, కిన్నెరసాని పాటలు, మధ్యార్కరాలు రచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తిని తీసుకువచ్చారన్నారు. ఆంధ్ర రాష్ట్ర ఆస్థాన కవిగా, రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా గౌరవాన్ని పొందారని కొనియాడారు. పత్తి రామానుజకూటంలో సంస్కారభారతి జిల్లా కన్వీనర్ పత్తి రంగమన్నారు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వనాథ వారి జయంతిని తెలుగు సాహితీ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. తెలుగు భాషను విద్యార్థి స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. పింగళి కోదండరామయ్య, సంస్కృత కళాశాల కరస్పాండెంట్ కోటి సూర్యనారాయణ మాట్లాడుతూ మన తెలుగు జాతి కీర్తిని దిగంతాలకు చాటిని మహోన్నతులు జయంతి, వర్ధంతులను నిర్వహిస్తూ యువతరానికి చేరువకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి కార్యదర్శి ఎన్.మాల్యాద్రి, పలు సాహితీ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.ఎస్.వి.ప్రసాద్, ఓరుగంటి ప్రసాద్, రామచంద్రుని శ్రీనివాసరావు, కుర్రా ప్రసాద్‌బాబు, నేచర్ ఫౌండేషన్ రాజశేఖర్, గాయకులు ఐ.మురళి కృష్ణ, మొవ్వా నాగేశ్వరరావు, పింగళి పూర్ణచంద్రరావు, బనారె, గుర్రం కృష్ణ, జాలాది మోహన్, ఆనంద్, పర్వతం రాంప్రసాద్, పిన్నంరాజు నరసింహారావు, విశ్వాసేవిక ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విశ్వనాధుని సత్యనారాయణకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులను ఘనంగా సత్కరించారు.



## నేడు పెడన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్

-సమస్యలను నేరుగా తెలుసుకోనున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పెడన నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపే ఉద్దేశంతో పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తోటములలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు మరియు ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి నేరుగా తీసుకురావచ్చు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.ప్రజా దర్బార్ అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అందజేయనున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## "కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

-పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



పామర్రు, సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీ భూమి హక్కులు మరియు పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం,1971 - రీసర్వే చేసిన గ్రామాలలో రాజకీయ పార్టీల లోగోలు, పేర్లను తొలగించి ప్రభుత్వ చిహ్నంతో కొత్త పాస్ పుస్తకాలను కూటమి ప్రభుత్వం జారీ చేస్తుంది. గురువారం తోట్లవల్లూరు మండలంలోని బొడ్డపాడు,చినపులిపాక గ్రామాలలో 707 కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా రైతులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 26 నెలలలో రైతుల ప్రగతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది అని తెలియజేసి గత ప్రభుత్వం రైతుల పాస్ పుస్తకాలపై సొంత ఫోటోలను ముద్రించి ఎటువంటి ఉపయోగం లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి , తోట్లవల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం, కృష్ణాజిల్లా తెలుగుయువత మాజీ అధ్యక్షుడు రామినేని వెంకట కుటుంబయ్య, వారితోపాటు ప్రభుత్వ అధికారులు,సీనియర్ నాయకులు,కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేషనల్ ఫోటోగ్రఫీ కాంటెస్ట్-2026లో సింహాద్రికి అవార్డు




నాగాయలంక, సెప్టెంబర్ 10 నేటి శుభోదయ : ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటి అండ్ కల్చరల్ కమిషన్ సహకారంతో ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా(పిఎఐ) నిర్వహించిన నేషనల్ం ఫోటోగ్రఫీ కాంటెస్ట్-2026లో దివిసీమకు చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ సింహాద్రి కృష్ణప్రసాద్(నాగాయలంక) పంపిన ఛాయాచిత్రానికి భారత దేశ గర్వకారణ ప్రశంసా అవార్డు (ప్రైడ్ ఆఫ్ ఇండియా అప్రిసియోషన్ అవార్డు) దక్కింది. నా భారతదేశం ప్రజాస్వామ్యం స్వాతంత్ర్యానికి 80ఏళ్ళు అనే ఇతివృత్తంతో జరిగిన కాంటెస్ట్లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్- 2026 ఎక్సెన్స్ అవార్డు ఆఫ్ ది ఇయర్ కింద కృష్ణప్రసాద్ పంపిన ఫోటో రూ.2వేలు నగదు, సర్టిఫికెట్ దక్కించుకుంది. నిబంధనల మేర పోటీకి రెండు ఫోటోలు పంపగా "యూనిటి ఇన్ డివోషన్" ఛాయచిత్రం ఈ అవార్డుకు ఎంపికైంది.నేషనల్ ఫోటోగ్రఫీ కాంటెస్ట్-2026 ఫలితాలను సలోన్ చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి గురువారం పిఎఐ వెబ్సైట్లో ప్రకటించారు. రూ.రెండు 'లక్షల నగదు బహుమతులు, గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలతో వివిధ విభాగాల్లో మొత్తం 60అవార్డులు



ప్రకటించారు. అవార్డులు గెల్చుకున్న విభాగాల్లో మొత్తం 60అవార్డులు ప్రకటించారు. అవార్డులు గెల్చుకున్న వారిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్, మహారాష్ట్ర, కేరళ, కర్నాటక, జమ్ము, గుజరాత్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన 182మంది ఫోటోగ్రాఫర్లు ఈ ఎన్ పిసి-2026కి ఎంట్రీలు పంపించినట్లు పిఎఐ పేర్కొంది. గాంధీ జయంతి పురస్కరించుకుని అక్టోబర్ 2వతేదిన విజయవాడలో జరిగే కార్యక్రమంలో కృష్ణప్రసాద్ ఈ అవార్డు అందుకుంటారు. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ గా ఆయన పలు ఫోటోలలో అనేక అవార్డులు అందుకున్నారు. నా భారతదేశం: ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యానికి '80ఏళ్ళు ఇతివృత్తంలో తాను అందించిన ఛాయచిత్రం ఈ అవార్డుకు ఎంపిక కావడం ప్రత్యేక సంతోషంగా ఉందంటూ జ్యూరి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమా సరస్వతి ప్రశంసనీయురాలు

-రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని ఉమా సరస్వతికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కారం



చల్లపల్లి, సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమా సరస్వతి ప్రశంసనీయురాలు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ అధ్యాపకురాలు ఓలేటి ఉమా సరస్వతి గురువారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సత్కారం అందుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉమా సరస్వతి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదో తరగతిలో తండ్రి, ఇంటరులో తల్లి మృతి చెందినా ఉన్నత ఆశయంతో భర్త ప్రోత్సాహంతో దూర విద్య ద్వారా డిగ్రీ, తెలుగు పండిట్ కోర్సులు చదువుకుని తెలుగు పండిట్ ఉద్యోగం సాధించిన ఉమా సరస్వతి అనేక రచనలు, అవధానాలు చేయటమే కాకుండా జాతీయ సెమినార్లలో పాల్గొని భాషకు, సంస్కృతికి సేవ చేయటం స్ఫూర్తిదాయకం అన్నారు.

## ఇద్దరు ఎమ్మెల్యేలతో మంచికల్లు మరింత అభివృద్ధి

రైతాంగ సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే జూలకంటి



రెంటచింతల: ఆర్ సి ఇన్చార్జి సెప్టెంబర్ 10; నేటి శుభోదయ: ఏ నియోజకవర్గానికీ లేని విధంగా మంచికల్లు గ్రామానికి ఇద్దరు ఎమ్మెల్యేల సహకారం అందుతోందని, ఒకవైపు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మరోవైపు తాను గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన రెంటచింతల మండలం మంచికల్లు గ్రామంలో పర్యటించారు. తొలుత శ్రీ చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. గ్రామ ప్రధాన కూడలిలో స్వర్గీయ యరపతినేని లక్ష్మయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.గ్రామంలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని 729 మంది రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సంస్కరణల ప్రదాత నందమూరి తారక రామారావు హయాంలో పట్టాదారు పాసుపుస్తకాలను ఎటువంటి ఖర్చు లేకుండా రైతుల ఇళ్లకే అందించేవారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు రీసర్వే ద్వారా రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రెండేళ్ల పాలనలో మంచికల్లు గ్రామానికి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి కలకాలం నిలుస్తుంది

: రజక నాయకులు



యాడికి సెప్టెంబర్ 10 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరవనిత చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి కలకాలం నిలిచిపోతాయని రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం యాడికి మండల కేంద్రంలో రజక వృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 10న వర్ధంతిని పురస్కరించుకుని ఐలమ్మ త్యాగాలను, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రజా సమస్యలపై ఆమె సాగించిన పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు రాముడు, విశ్వనాథ్, చలపతి, శివయ్య, సూరి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ సాక్షిగా ఊరుకునే ప్రసక్తే లేదు..!

**గ్రామోత్సవాల్లో అలజడులు సృష్టిస్తే శిక్షలు తప్పవు**

**-- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం**



మాచర్ల మండలం: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 10 ; నేటి శుభోదయ : గ్రామాభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం నిర్వహించే గ్రామోత్సవాల్లో నీచ రాజకీయాలకు పాల్పడి అలజడులు సృష్టించాలని చూస్తే ఎంతమాత్రం సహించేది లేదని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.గురువారం మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో కొలువుదీరిన గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన శిడిమాను ఉత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాను గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీసు శాఖ విధించిన పలు ఆంక్షల నేపథ్యంలో జాతర, తిరునాళ్లకు అనుమతులు లభించాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం పండుగ వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. పోలీసులకు సహకరిస్తూ ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు.గ్రామానికి చెడ్డపేరు వచ్చేలా ఎవరైనా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముత్యాలమ్మ తల్లి సాక్షిగా గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు



## గ్రామాభివృద్ధికి జైకొట్టి.. వైసీపీకి గుడ్‌బై..!

**-- వైసీపీని వీడి టీడీపీలోకి వలసలు**



దుర్గి: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 10 ; నేటి శుభోదయ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు.మండల పరిధిలోని శ్యామరాజుపురం గ్రామంలో గురువారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన 10 కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పనితీరును గమనిస్తున్న ప్రజలు టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, లింగా బ్రహ్మయ్య, జానికిరామయ్య, యాగంటి నరేష్, సింగు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ శ్రీ షిర్డీసాయి ఆలయంలో భక్తులకు ఘనంగా అన్న సమారాధన..!

**- 'అన్ని దానములు కన్నా - అన్న దానము మిన్న..'**

**- ఆధ్యాత్మిక వేత్త శ్రీమతి యెజ్జు ఉమా పార్వతీశం -సరిత దంపతులు..!**



కోరుకొండ, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);మండల కేంద్రం కోరుకొండ వెలసిన శ్రీ ద్వారక షిరిడి సాయి ఆలయంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీ షిర్డీసాయి బాబాకు ప్రత్యేక పూజలు, హారతులు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక వేత్త శ్రీమతి యెజ్జు ఉమా పార్వతీశం - సరిత దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అన్ని దానములు కన్నా అన్న ప్రసాద0 మిన్న అని, అందరూ బాగుండాలి -అందులో మనం అందరు ఉండాలి అని, మానవ సేవే -మాధవ సేవ గా భావించాలి అని,ధర్మ కార్యములు, యజ్ఞ-యాగ కార్యములు నిరంతరం చేస్తే సర్వ లోకములు సుభిక్షం గా ఉంటాయని తద్వారా మానవ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడుస్తుందని ఉమా పార్వతీశం అన్నారు. ప్రతీ ఒక్కరు ఆర్థిక వెసులుబాటును బట్టి ధర్మ కార్యములు - మీరు నమ్ముకున్న దేవుడు కార్య క్రమాల్లో పాల్గొనాలని కోరారు. ధర్మో రక్షిత రక్షితః - వృక్షో రక్షిత రక్షితః- మానవ సేవే - మాధవ సేవ... ఇవి ప్రతీ ఒక్కరు ఆచరణలో పెడితే సమాజం సహజంగా అభివృద్ధి చెందుతుందన్నారు...ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని శ్రీ సాయిబాబా, శ్రీ గురు అనఘా దత్తత్రేయలు స్వామి ని దర్శించి తీర్థ -అన్న ప్రసాదములు స్వీకరించారు. కమిటీ అధ్యక్షుడు వాకచర్ల రామకృష్ణ, సభ్యులు తగరంపూడి గణపతి, భక్తులు పాల్గొన్నారు.



## వినాయక చవితి వేడుకల్లో నిబంధనలు పాటించాలి

**బాపట్ల పట్టణ సీఐ రాంబాబు**



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) సెప్టెంబర్ 10 : వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు కోరారు. ముందుగా జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.వినాయక మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహ కమిటీ సభ్యుల జాబితాను పోలీసులకు అందజేయాలని తెలిపారు. లైటింగ్ వైరింగ్‌లో ఎలాంటి అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతులు కూడా తప్పనిసరిగా పొందాలని చెప్పారు. మండపాల్లో మైక్ వినియోగానికి అనుమతి తీసుకోవాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. కమిటీ జాబితాలోని సభ్యుల్లో ఎవరో ఒకరు ఎల్లప్పుడూ మండపం వద్ద ఉండేలా చూసుకోవాలని, విలువైన వస్తువులను మండపాల్లో ఉంచరాదన్నారు.విగ్రహాల వద్ద అశ్లీల నృత్యాలు, పాటలు నిర్వహించరాదని, మద్యం సేవించి మండపాల వద్దకు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నిమజ్జనంలో అప్రమత్తత:వినాయక విగ్రహాల నిమజ్జనానికి చిన్న పిల్లలను తీసుకెళ్లరాదని సీఐ సూచించారు. నిమజ్జనం సమయంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించరాదన్నారు. మండపాల వద్ద ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ రాంబాబు కోరారు. విఘ్నేశ్వరుని చల్లని చూపు జిల్లా ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

## ఎన్టీఆర్ స్ఫూర్తితో రైతులకు సంక్షేమం..!

**- కూటమి ప్రభుత్వ సంస్కరణలతో రైతే రాజు**

**- రైతుల ఆస్తులను హరించేందుకు జగన్ కుట్రలు చేశారని ఆరోపణ**

**- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



దుర్గి: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 10;నేటి శుభోదయ : టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. రైతును రాజుగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.గురువారం దుర్గి మండల పరిధిలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా మైనింగ్ గ్రాంట్ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన క్రీస్తు లూథరన్ చర్చి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, గ్రామంలో పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రెవెన్యూ అధికారులు నిర్వహించిన 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని 857 మంది రైతులకు రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతుల భూములకు సంబంధించి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి వారి ఆస్తులపై అనిశ్చితి కల్పించారని విమర్శించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు, పొలం గట్ల రాళ్లపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటో ముద్రించడం ద్వారా రైతుల ఆస్తులను ఇబ్బందుల్లోకి నెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూముల రీసర్వే చేపట్టి, రైతుల హక్కులను పరిరక్షించేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం నిలిపివేసిన రైతు సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరిస్తూ, రైతుల అభ్యున్నతికి



చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్ వరకుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జునరావు, లింగా బ్రహ్మయ్య, జానికిరామయ్య, శంకర్, రమేష్, నాగేశ్వరరావు, పులిహరి తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి : ఐద్వా




చింతూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం కారం లక్ష్మీ అధ్యక్షతన చింతూరు లో జరిగింది.ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ. పద్మావతి మాట్లాడుతూ... పోలవరం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని, వెంటనే ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించి, రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సోడే రమాదేవి, నూనె అశ్విని, దారమ్మ, బుచ్చమ్మ, సీతమ్మ, స్వరూప, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏపీపీఎస్సీ ద్వారా నలుగురు అధ్యాపకుల నియామకం



చింతూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :: చింతూరులోని : ప్రభుత్వడిగ్రీ,కళాశాలలో ఇంగ్లీష్,మ్యాథమెటిక్స్,కెమిస్ట్రీ, జువాలజీ, సబ్జెక్టులలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన నలుగురు అధ్యాపకులు నూతనంగా విధుల్లో చేరారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి వీరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మణిమాల మాట్లాడుతూ కొత్తగా అధ్యాపకుల నియామకంతో కళాశాలలో బోధన సిబ్బంది బలోపేతం అవుతుందని, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. అధ్యాపకులు తమ బోధనా అనుభవం నైపుణ్యాలతో, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కొత్తగా విధుల్లో చేరిన అధ్యాపకులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## మాచర్లలో రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

**మరో వ్యక్తికి తీవ్ర గాయాలు**



మాచర్ల : ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 10; నేటి శుభోదయ : పల్నాడు జిల్లా మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.జమ్మలమడక గ్రామానికి చెందిన కూరాకుల చిన్న మల్లయ్య (45) ద్విచక్ర వాహనంపై మాచర్ల వైపు వెళ్తుండగా.. తుమ్మకోట గ్రామానికి చెందిన మద్దిపట్ల సైదయ్య మాచర్ల నుంచి జమ్మలమడక వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో జమ్మలమడక వెళ్లే రహదారిపై రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి.ప్రమాద తీవ్రతకు కూరాకుల చిన్న మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో ద్విచక్ర వాహనదారుడు మద్దిపట్ల సైదయ్య తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వెంటనే మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న మాచర్ల రూరల్ ఎస్సై వెంకట్రావు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను పరిశీలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## జేఏసీ ఆధ్వర్యంలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: ఏపీ జెఎసి, మెడికల్ అండ్ హెల్త్, ఆధ్వర్యంలో ఈరోజు 30 రోజుల కార్యచరణలో భాగంగా గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో బ్లాక్ మాస్క్ ప్రొటెస్ట్ కార్యక్రమాన్ని స్టాఫ్ నర్స్ మరియు పారామెడికల్ స్టాఫ్ అందరు కలిసి నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏపీజిసియన్ డిస్టిక్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ, గవర్నమెంట్ మాకు ఇచ్చిన 30 రోజుల గడువులో మాకు గవర్నమెంట్ న్యాయం చేస్తుందని 16 సంవత్సరాల మా కలను నెరవేరేలా ఈ గవర్నమెంట్ చేస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నామని మా నమ్మకాన్ని ఈ గవర్నమెంట్ వోమ్ము చేయదని ఆశిస్తున్నామని చెప్పారు.. ఏపీ జేఏసీ కన్వీనర్ లావణ్య మాట్లాడుతూ, కరోనా వంటి సమయంలో ప్రాణాలకు తెగించి పోరాడేమని చెప్పారు. ఎపిజిసిసి ఎన్ని సభ్యురాలు అనిత మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న మాకు న్యాయం జరిగేలాగా గవర్నమెంట్ చూడాలని మాకు న్యాయం చేయాలని మాట్లాడారు ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ శరత్, ఏపీ జి సి ఎన్ ఏ వైస్ ప్రెసిడెంట్ ఎర్రిస్వామి, కెఫా సునీత, మెడికల్ అండ్ స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు

## తాడిగడప మున్సిపాలిటీ కార్మిక నగర్ లో చాకలి ఐలమ్మ వర్ధంతి



పెనమలూరు, సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ ని తడిగడప మున్సిపాలిటీ తెదేపా అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ లు అన్నారు. గురువారం తాడిగడపలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ చాకలి ఐలమ్మ నాటి భూస్వామ్య, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి, అణగారిన ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. తన భూమి కోసం మాత్రమే కాకుండా, పేదలు మరియు సామాన్య ప్రజల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. అన్యాయానికి తలవంచకుండా, ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడిన ఐలమ్మ గారి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. మహిళలు సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడానికి ఆమె పోరాటం ఒక మార్గదర్శకంగా నిలిచిందన్నారు.చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ, సమాజంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళల సాధికారతకు, సామాజిక న్యాయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిస్తున్నాము. వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్థాయిగా నిలవాలని,ఆమె ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో జుజ్జువరపు లింగేశ్వరరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ తాతపూడి గణేష్, అగ్నికుల క్షత్రీయ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, ఎ. ఎం. సి. వైస్ చైర్మన్ కళ్యాణి, తుమ్మల రాంకుమార్, బొంగరాల అబ్రహం, ఆకునూరి సుబ్బారావు, వణుకూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రకటించిన ఎన్ఎస్ యుఐ రాష్ట్ర, జిల్లా కమిటీలను వెంటనే రద్దు చేసిన జాతీయ ఎన్ ఎస్ యుఐ అధ్యక్షులు వినోద్ జాఖర్

ఖమ్మం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వినోద్ జాఖర్ ప్రకటన మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడి పేరుతో వెలువడిన రాష్ట్ర, జిల్లా కమిటీ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు పేర్కొన్నారు. తదుపరి ప్రకటన వెలువడే వరకు ఈ కమిటీ నిలిపివేసినట్లు ప్రకటించారు.

## బెంజిసర్కిల్ కొత్త ఫ్లైఓవర్ పై ప్రమాదం



విజయవాడ, సెప్టెంబర్ 10 నేటి శుభోదయ: వెళుతున్న కారు లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో పక్కనే కారు ఆపి బయటకు పరుగులు తీశారు. ప్రయాణికులు చూస్తుండగానే కారు ను మంటలు చుట్టుముట్టడంతో భయాందోళనకు గురయ్యారు.ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకపోవడం తో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## గుత్తి కోటకు అరుదైన గౌరవం స్మారక తపాలా బిళ్లకు కీలక ముందడుగు

**అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృషికి మరో గుర్తింపు**



అనంత పురం సెప్టెంబర్ 10 నేటి శుభోదయ : అనంతపురం జిల్లాకు చెందిన చారిత్రక వారసత్వ సంపద గుత్తి కోటకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చే దిశగా కీలక ముందడుగు పడింది. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని అనంతపురం ఎంపీ శ్రీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి చేసిన ప్రతిపాదన కేంద్ర తపాలా శాఖలో కీలక దశకు చేరుకుంది.గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ పరిశీలన జరిపి, స్మారక తపాలా బిళ్ల విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రివర్యుల ఆమోదం కోసం సమర్పించింది.తపాలా శాఖ అధికారిక నోట్‌లో గుత్తి కోట రాష్ట్రంలోని అతిపెద్ద కోటల్లో ఒకటిగా, 1921 నుంచి భారత పురావస్తు సర్వే శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర రక్షిత స్మారక చిహ్నంగా ఉన్నట్లు పేర్కొంది. చాళుక్యులు, విజయనగర సామ్రాజ్యం, మొఘలులు, మరాఠాలు, బ్రిటిష్ పాలన వంటి అనేక చారిత్రక దశలకు గుత్తి కోట సాక్ష్యంగా నిలిచిందని గుర్తించింది.గుత్తి కోటలోని బహుళస్థాయి ప్రాకారాలు, బురుజులు, పురాతన మార్గాలు, నీటి నిల్వలు, చారిత్రక శ్రీ రఘునాథస్వామి ఆలయం వంటి నిర్మాణాలు దాని అపారమైన చారిత్రక, నిర్మాణ, సాంస్కృతిక ప్రాధాన్యతను ప్రతిబింబిస్తున్నాయని తపాలా శాఖ పేర్కొంది.గుత్తి కోటపై ఇప్పటివరకు స్మారక తపాలా బిళ్ల విడుదల కాలేదని కూడా తపాలా శాఖ అధికారికంగా నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రతిపాదనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.1 లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధనకు మినహాయింపు స్మారక తపాలా బిళ్లల విడుదలకు సాధారణంగా అమల్లో ఉన్న 1 లక్ష బిళ్లల తప్పనిసరి కొనుగోలు నిబంధన నుంచి గుత్తి కోట ప్రతిపాదనకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీ శ్రీ అంబికా లక్ష్మీనారాయణ గారు కేంద్రాన్ని కోరారు. ఈ మినహాయింపుతో కూడిన ప్రతిపాదనను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రివర్యుల ఆమోదం కోసం తపాలా శాఖ ఫైల్‌లో సమర్పించింది.గుత్తి కోటకు స్మారక తపాలా బిళ్ల విడుదలైతే అనంతపురం జిల్లా చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించడంతో పాటు, గుత్తి కోటను ప్రముఖ వారసత్వ, సాంస్కృతిక, విద్యా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది. "అనంతపురం జిల్లాకు ఉన్న గొప్ప చారిత్రక వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. గుత్తి కోటపై స్మారక తపాలా బిళ్ల విడుదలకు ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే గుత్తి కోట చరిత్రకు, అనంతపురం జిల్లా ప్రజలకు ఇది ఒక ప్రత్యేక గౌరవంగా నిలుస్తుంది" అని ఎంపీ శ్రీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి పేర్కొన్నారు. గుత్తి కోటకు స్మారక తపాలా బిళ్ల.. అనంతపురం చారిత్రక వారసత్వానికి జాతీయ గుర్తింపు దిశగా మరో కీలక అడుగు.



## జనసేన ఎక్కువ స్థానాల్లో పోటీ చేస్తుంది
### పెంటపాడు మండలం పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి



పెంటపాడు, సెప్టెంబర్ 10 (నేటి–శుభోదయ) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం జనసేన పార్టీ అత్యధిక స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి సంచలన వ్యాఖ్య చేశారు. పెంటపాడు లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం పెంటపాడు మండలం జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మండల పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో జనసేన పార్టీ చాలా బలంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నాయకత్వంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఒకప్పటి పార్టీ పరిస్థితిని, నేటి పరిస్థితిని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. దానికి అనుగుణంగా గ్రామాలలో జనసేన పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని పుల్లా బాబి సూచించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొణతాల వెంకటరావు, ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ కసిరెడ్డి మధులత, ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణ్ రెడ్డి, పార్టీ నాయకులు కొనకళ్ళ హరనాథ్, చేరుకూరి జగత్ సోమశేఖర్(పండు), దర్శిపర్రు సొసైటీ చైర్మన్ పాలూరి భూపాల్, ఇంకా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## త్రివేణి కిడ్స్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే
### తరతరాల అనుబంధానికి వేదికగా ఆత్మీయ వేడుకలు




ఖమ్మం, సెప్టెంబరు 10, నేటి శుభోదయ ::: తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలతో పిల్లల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, వారి ప్రేమ, ఆప్యాయత, అనుభవాలను పిల్లలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో త్రివేణి కిడ్స్ క్యాంపస్‌లో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తాతయ్యలు, అమ్మమ్మలతో కలిసి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు తమ గ్రాండ్ పేరెంట్స్‌కు పాదపూజ చేసి ఆశీర్వాదాలు పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేమాభిమానాలతో వారిని సత్కరించి, బహుమతులు అందజేశారు. పిల్లలతో కలిసి సమయం గడిపిన గ్రాండ్ పేరెంట్స్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తీసుకున్న ఫొటోలు ఆత్మీయ జ్ఞాపకాలుగా నిలిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ "పిల్లల వ్యక్తిత్వ వికాసంలో గ్రాండ్ పేరెంట్స్ పాత్ర ఎంతో విలువైనది. వారి అనుభవాలు, జీవిత విలువలు, ప్రేమ పిల్లలకు మంచి మార్గదర్శకంగా నిలుస్తాయి. తరతరాల మధ్య అనుబంధాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో కుటుంబ విలువలను మరింత బలపరుస్తాయి" అని అన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "తాతయ్యలు, అమ్మమ్మలు పిల్లలకు ప్రేమను మాత్రమే కాదు. జీవితాన్ని అర్థం చేసుకునే జ్ఞానాన్ని, సంస్కారాన్ని అందిస్తారు. వారితో పిల్లలు గడిపే ప్రతి క్షణం ఒక మధురమైన జ్ఞాపకంగా మిగులుతుంది. గ్రాండ్ పేరెంట్స్ డే ద్వారా పిల్లలు తమ పెద్దల పట్ల కృతజ్ఞత, గౌరవ భావాలను వ్యక్తం చేయడం ఎంతో ఆనందంగా ఉంది" అని తెలిపారు. కార్యక్రమం ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగగా, విద్యార్థులు–ఉపాధ్యాయులు, పాటలు, కవితలతో అలరించగా, గ్రాండ్ పేరెంట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. "తరాలు కలిస్తే భవిష్యత్తు మరింత వెలుగొందుతుంది" అనే సందేశంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## టైం ఆగిపోతే...

– మంజుల పత్తిపాటి

టైం ఆగిపోతే...
పకృతి మౌనమైపోతే...
పరుగులు తీసే ఈ లోకం
ఒక్క క్షణం ఊపిరి పీల్చుకుంటుందా..
నిన్నటి జ్ఞాపకాలు
నేటి గడప దాటి వస్తాయా
చేతుల నుంచి జారిపోతున్న ప్రాణం
మళ్లీ ఊపిరి
పీల్చుకుంటుందా..
డబ్బు కోసం
పరుగెత్తిన
మనిషి
అదే



డబ్బుతో
టైముని
కొనగలడా..
ధన దాహంతో
పచ్చదనాన్ని నాశనం
చేసి
కాంక్రీటు అడవుల్లో బహుళ అంతస్తుల
భవనాల్లో
నివసిస్తున్న బడా బాబులు...
అదే డబ్బుతో టైముని కొనగలడా..
కానీ ఆ రోజు ఎప్పుడికి రాకుండా
చూడాల్సిన
బాధ్యత మన అందరిపై ఉన్నది..!
ఓ మనిషి
నిజంగానే టైం ఆగిపోతే...
నీవు సంపాదించుకున్న సొమ్ము
గంగపాలు అవుతుంది..!
కనుక సంపాదించుకున్న సొమ్ములో
కొంత పకృతి కోసం ఖర్చు పెట్టు..!
ప్రకృతిని
కాపాడు...మనిషితనాన్ని
నిలబెట్టు..!

రచన: శ్రీమతి మంజుల పత్తిపాటి
చరవాణి 9347042218
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ.

## రాష్ట్రం లో 6వ,స్థానం సాధించిన ఎంఎల్ఏ బడేటి చంటి
### అభినందించిన కేంద్ర ప్రభుత్వ టిఎసి మాజీ సభ్యులు పులి శ్రీరాములు



ఏలూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ ::: రాష్ట్రం లోని శాసన సభ్యుల్లో తన పనితీరు ఆధారంగా 6వ,స్థానం(ర్యాంకు)సాధించిన ఏలూరు ఎంఎల్ఏ బడేటి రాధాకృష్ణయ్య చంటి ని కేంద్ర ప్రభుత్వ టిఎసి మాజీ సభ్యులు పులి శ్రీరాములు అభినందించారు. ఇటీవల జరిగిన తెలుగు దేశం పార్టీ రాష్ట్ర సమావేశంలో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు ప్రకటించిన ర్యాంకుల్లో బడేటి కీ 6వ స్థానం రావటమేకాకుండా ,ప్రజల కు నిత్యం అందుబాటులో ఉంటూ క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ తదితర అంశాల పై స్పందించిన ముఖ్య మంత్రి బడేటి చంటి ని అందరూ అనుసరించాలని అనటం ఏలూరు నియోజకవర్గానికి గర్వకారణమని పులి శ్రీరాములు పేర్కొన్నారు.

## మానవహక్కులు మరియు క్రైమ్ నిర్మూలన సొసైటీ రాష్ట్ర అధ్యక్షులుగా రామకృష్ణా రెడ్డి ఎంపిక..
### అనంతపురం జిల్లా అధ్యక్షులుగా ప్రేమ్ సాగర్ లు ఎంపిక.




అనంతపురం సెప్టెంబర్ 10, తెలుగు సవ్వడి న్యూస్.:ఆంధ్రప్రదేశ్ మానవహక్కులు మరియు క్రైమ్ నిర్మూలన సొసైటీ రాష్ట్ర అధ్యక్షులుగా వి. వి. రామకృష్ణా రెడ్డి ఎంపిక అయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు కైలాష్ శర్మ రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రామకృష్ణ రెడ్డి ఈ విషయాన్ని తెలియజేశారు. అనంతరం నూతన రాష్ట్ర, జిల్లా కార్యవర్గంతో కలిసి వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి పెరిగిపోయింది అని, దీనితో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వ హాస్పిటల్, ప్రభుత్వ శాఖలలో అవినీతికి పాల్పడే అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తాము ప్రజల ప్రక్షాన నిలబడి తగిన న్యాయం చేస్తామని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా చైతన్య, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గా శ్రీనివాస్, రాష్ట్ర సెక్రటరీ, జిల్లా సెక్రటరీ గా పులిశ్వేత ఎంపికయ్యారు. అంతే కాకుండా అనంతపురం అధ్యక్షులు గా ప్రేమ్ సాగర్, ఉపాధ్యక్షులుగా మాసుల ఆహమ్మద్ రాజా తదితరులు ఎంపిక అయినట్లు తెలిపారు.

## అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు డబుల్ బొనాంజా
### ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి ఉత్తమ ఐ ఇ ఐ స్టూడెంట్ చాప్టర్ అవార్డు కైవసం.
### మూడు విభాగాలకు ఎన్ బి ఏ గుర్తింపు ఇచ్చినట్లు తెలిపిన జయచంద్రా రెడ్డి.



అనంతపురం సెప్టెంబర్ 10, .:అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరో ప్రతిష్టాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. కళాశాలలోని ఐ ఇ ఐ స్టూడెంట్ చాప్టర్ కు రాష్ట్రస్థాయి అవార్డ్ లభించింది. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు పరిశ్రమలతో అనుసంధానాన్ని పెంపొందించేందుకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు ఈ గుర్తింపు లభించింది. ఈ రాష్ట్రస్థాయి ఐ ఇ ఐ బెస్ట్ స్టూడెంట్ అవార్డును ఇంనిర్స్ డే అయిన 15 సెప్టెంబర్ తేదిన ఏపీ ఎస్ సి ఆఫీస్, డాక్టర్. కె. ఎల్. రావు భవన్ విజయవాడ నందు ఈ అవార్డ్ ను ఇవ్వనున్నారు. కళాశాలలోని ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ మరియు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ లభించడం అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చిన మరో ఘనత అని చెప్పవచ్చు. ఈ ఏడాది నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ బృందం జూన్ 20న అనంతపురం కళాశాలను సందర్శించి, ఆయా విభాగాలను సమగ్రంగా పరిశీలించడంతో పాటు, సంబంధిత పత్రాలు మరియు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిది. మూడు ఇంజినీరింగ్ విభాగాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ లభించడం మరో ముఖ్యమైన విషయం. ఈ గుర్తింపు ఆయా విభాగాల్లోని విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, ప్రయోగశాలలు, అధ్యాపకుల నాణ్యత, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి మరియు విద్యా ఫలితాలకు లభించిన విశిష్ట గుర్తింపుగా భావించవచ్చు. ఐ ఇ ఐ స్టూడెంట్ చాప్టర్ ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సాంకేతిక సెమినార్లు, వర్క్‌షాప్‌లు, నిపుణుల ఉపన్యాసాలు, పరిశ్రమల సందర్శనలు, సాంకేతిక పోటీలు మరియు ఇతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడంలో కళాశాల కట్టుబాటును మరింత బలోపేతం చేసినట్లయింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్ర రెడ్డి మాట్లాడుతూ అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ద్వారా బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డు రావడం అలాగే మూడు ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ విభాగాలకు అవార్డులు లభించడం కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ విజయాలు అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థుల సమిష్టి కృషికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడమే మా ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచి, విద్యార్థుల ఉపాధి మరియు ఉన్నత విద్యా అవకాశాలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అవార్డు మరియు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

## ఫీజుల వసూళ్లేనా.. పిల్లల భద్రత అక్కర్లేదా..
### ట్రెల్లీస్ స్కూల్ ఘటనపై సీఐటీయూ ఆందోళన..
### ట్రెల్లీస్ స్కూల్ ను సీజ్ చేయాలన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్.



అనంతపురం సెప్టెంబర్ 10, : ట్రెల్లీస్ పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలిక పట్ల సిబ్బంది అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై పాఠశాల యాజమాన్యం స్పందించిన తీరుపై విచారణ జరపాలని, బాలిక భద్రతకు తగిన చర్యలు ఎందుకు తీసుకోలేదో యాజమాన్యం సమాధానం చెప్పాలని కోరారు. ఆధునిక భద్రతా సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ పాఠశాలలో తగిన భద్రతా చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు యాజమాన్యమే ప్రధాన బాధ్యత వహించాలని, సిబ్బంది నియామకంలో పూర్వచరిత్ర పరిశీలన, పాఠశాల ప్రాంగణంలో నిరంతర పర్యవేక్షణ, అవసరమైన భద్రతా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. భారీగా ఫీజులు వసూలు చేసే పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా పేరెంట్స్ కమిటీలను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రభుత్వం, యాజమాన్యాలను ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యాశాఖ నిబంధనలు, బాలల భద్రతా ప్రమాణాలు అమలవుతున్నాయా లేదా పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాగేంద్ర కుమార్ అన్నారు. అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థుల భద్రతపై గతంలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను సమీక్షించాలని కోరారు. మండల విద్యాధికారుల దీర్ఘకాలిక పోస్టింగులు, బదిలీలు, పాఠశాలల తనిఖీల తీరును ప్రభుత్వం పారదర్శకంగా సమీక్షించాలని అన్నారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల బాధ్యతతో పాటు, పర్యవేక్షణలో ప్రభుత్వ జవాబుదారీతనం కూడా స్పష్టంగా ఉండాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. పోక్సో కేసులో దర్యాప్తును వేగంగా, నిష్పక్షపాతంగా పూర్తి చేసి, నేరం నిర్ధారణైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాలల భద్రతా నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తాడిపత్రి అల్లా బక్షీస్.
### నియామక పత్రాలను అందించిన రాష్ట్ర అధ్యక్షులు దాదా గాంధీ.



అనంతపురం సెప్టెంబర్ 10, .: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తాడిపత్రి అల్లా బక్షీస్ మహ్మద్ అన్వరు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం అనంతపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదాగాంధీ చేతులు మీదుగా తాడిపత్రి అల్లా బక్షీస్ మహ్మద్ అన్వరుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నింటా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి పార్టీ బలం చూపించాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏ ఐ సి సి మరియు ఏపి సి సి సభ్యులు కాపు గాజుల వాసు, తాడిపత్రి ఇంచార్జ్ సూరి నారాయణ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి మౌలానా నవాజ్ చిస్థిఉల్ ఖాద్రీ సాహెబ్ మరియు రాష్ట్ర స్పోక్ పర్సన్ జాకీర్ హుస్సేన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు శర్మాస్ వలి, ఐ ఎన్ టి యు సి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే. నారాయణ స్వామి మైనారిటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ షఫీ, పట్టణ నాయకులు నరసింహారెడ్డి, అనిల్ కుమార్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ట్రెలిస్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి..
### ఏపి స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ .



అనంతపురం సెప్టెంబర్ 10, : చిన్నారి పైన లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఐక్య విద్యార్థి సంఘాల నేతలు ట్రెలిస్ స్కూల్ వద్ద తల్లిదండ్రులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన విద్యార్థిని తల్లిదండ్రులను స్కూలు యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఘటన జరిగి పది రోజులు అవుతున్న ఎందుకు బయటనే ఉంచారని అక్కడున్న పోలీసు అధికారులను నిలదీశారు. ట్రెలిస్ స్కూల్ కు ఇవేమీ కొత్త కాదని చాలా మంది బాధితులు ఉన్నారని, అలాంటివారిని ఐక్యత చేసి ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థిని తల్లిదండ్రులను ఆదుకొని, వారి భద్రతకు ఇవ్వాలని, తల్లిదండ్రులకు ఏమైనా జరగరాని ఘటన జరిగితే స్కూలు యాజమాన్యం బాధ్యత వహించాలని తెలిపారు. మా పిల్లకి ఇలా జరిగిందని స్కూల్ యాజమాన్యం ప్రశ్నిస్తే ఇది చిన్న విషయమేనని తేలిగ్గా మాట్లాడాలని విద్యార్థి తల్లి మీడియాకు తెలిపారు. స్కూల్ యాజమాన్యం పైన కూడా ఫోక్సో కేసు నమోదు చేసి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం వివిధ విద్యార్థి నేతలు బీసీ సురేష్ యాదవ్, అమర్ యాదవ్, నరసింహ, పరమేష్, నరేష్, పృథ్వి, వినోద్, విజయ్, రాజేష్, మంజునాథ్, వంశీ తదితర విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

## గార్లదిన్నె మోడల్ స్కూల్ టీచర్ చింతా నారాయణ సస్పెన్షన్.



అనంతపురం సెప్టెంబర్ 10, .:జిల్లాలోని గార్లదిన్నె మోడల్ స్కూల్లో పనిచేస్తున్న టీచర్ చింతా నారాయణ ను సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్. ఎన్. అయూబ్ హుస్సేన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన విద్యార్థినీలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో దీనిపై విచారణకు జిల్లా అధికారులు ఆదేశించారు. విచారణ పూర్తిఅయి టీచర్ చింతా నారాయణపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో గురువారం ఆయనను సస్పెన్షన్ చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## పట్టపగలే మద్యం మత్తులో ఊగుతూ కార్యాలయానికి వచ్చిన వెలుగు సీసీ..

అమరాపురం సెప్టెంబర్ 10: అమరాపురం మండల కేంద్రంలోని స్థానిక హేమ మండల సమైక్య వెలుగు కార్యాలయం నందు పట్టపగలే మద్యం మత్తులో ఊగుతూ కార్యాలయానికి వచ్చిన వెలుగు సీసీ భాస్కర్. ఒక్కసారిగా కార్యాలయానికి వచ్చిన వారు అవాక్కయ్యారు. తీవ్ర బూతు పురాణాలతో ఇష్టానుసారంగా దుర్భాష పదజాలం తో మాట్లాడుతూ కార్యాలయంలో నానా హంగామా చేయడం జరిగింది. ఈ ఘటనపై కార్యాలయంలో ఎవరు ఏమి మాట్లాడలేకపోయారు. ఎవరిని ఏ విషయం అడిగిన అక్కడున్న సిబ్బంది మాకు సంబంధం లేదంటూ తప్పుకొన్నారు. నిత్యం మహిళలు వచ్చిపోయే కార్యాలయంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యతారాహిత్యం మరోసారి బట్టబయలైంది. పేద మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాల్సిన 'వెలుగు' డి.ఆర్.డి.ఎ కార్యాలయంలో ఒక బాధ్యతాయుతమైన పొజిషన్‌లో ఉన్న క్లస్టర్ కో–ఆర్డినేటర్ మద్యం మత్తులో విధులకు హాజరై నానా హంగామా సృష్టించారు. ఈ షాకింగ్ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అసలేం జరిగిందంటే కార్యాలయ పనివేళల్లో సదరు వెలుగు సీసీ పూర్తిగా మద్యం సేవించి ఆఫీసుకు వచ్చారు. వివిధ పనుల నిమిత్తం, స్వయం సహాయక సంఘాల లోన్ల విషయమై కార్యాలయానికి వచ్చే మహిళా సంఘాల ప్రతినిధుల మధ్య విధులు నిర్వహించాల్సి ఆయన తప్ప తాగి ప్రవర్తించడం, కార్యాలయానికి వచ్చిన వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, మద్యం మత్తులో తూలుతూ, పిచ్చిపిచ్చిగా మాట్లాడటంతో మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఉద్యోగి నోటి నుంచి విపరీతంగా మద్యం వాసన వస్తుండటాన్ని గమనించిన మహిళలు, స్థానికులు మండిపడ్డారు. ఈ సంఘటన జరుగు సమయంలో సిబ్బంది అకౌంటెంట్ వరలక్ష్మి, సి సి సత్య జ్యోతి, స్వీపర్ శ్రామికులు లక్ష్మమ్మ వున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, విధుల్లో ఉంటూ మద్యం సేవించడంపై ఉన్నతాధికారులు ఇలాంటి వారిని తక్షణం విధులోంచి తొలగించి క్రమశిక్షణ చర్యలు కొనసిగించే బాధ్యత ఉందని గుర్తు చేశారు. కార్యాలయానికి వచ్చిన మహిళా సంఘాల సభ్యులను ఇబ్బంది పెట్టినందుకు గానూ సదరు సీసీపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే అతనిని విధుల నుంచి తొలగించడం లేదా సస్పెండ్ చేయడంపై నివేదిక సిద్ధం చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ సిబ్బంది ఇలా పట్టపగలే తాగి కార్యాలయాలకు రావడంపై స్థానిక మహిళా సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇతరులకు బుద్ధి వస్తుందని డిమాండ్ చేస్తున్నారు.

# విజయ్ దేవరకొండ 'రణబాలి' టీజర్.. ఊచకోతలో ఓ ట్విస్ట్




విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'టాక్సీవాలా' మంచి హిట్ కొట్టింది. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఏకంగా బ్రిటీష్ కాలం నాటి పీరియాడిక్ కథతో వస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మాణంలో రూపొందుతున్న సినిమా 'రణబాలి'. ఇక ఫస్ట్ లుక్ నుంచే క్యూరియాసిటి క్రియేట్ చేస్తున్న టీజర్ వచ్చేసింది. సీన్స్ చూస్తే విజయ్ తన లవర్ బాయ్ ఇమేజ్‌ను పూర్తిగా చెరిపేసుకుని, ఒక రా అండ్ రస్టిక్ వారియర్‌గా కనిపించి సర్ప్రైజ్ చేశారు. 1876-78 నాటి గ్రేట్ మద్రాస్ ప్రెసిడెన్సీ కరువు నేపథ్యంలో 80 లక్షల మంది భారతీయులు ఆకలితో చనిపోయిన దారుణమైన రోజులను టీజర్ ఆరంభంలో చూపించారు. అన్నపూర్ణ లాంటి దేశంలో గింజల కోసం ప్రజలు అల్లాడుతుంటే, బ్రిటీష్ పాలకులు చేసే అకృత్యాలు కంటతడి పెట్టించే ఎమోషన్‌ను క్రియేట్ చేశాయి. ఆకలి కేకలు, ఎండిపోయిన మట్టి నేలల విజువల్స్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా డిజైన్ చేశారు. ఈ అణచివేతకు వ్యతిరేకంగా గొంతెత్తిన యోధుడిగా 'సింగనమల బొబ్బిలి రణబాలి' పాత్రలో విజయ్ దేవరకొండ ఎంట్రీ ఇచ్చారు. ఒంటినిండా రక్తపు చారలు, చేతిలో పెద్ద కొడవలి పట్టుకుని గుర్రంపై వచ్చే షాట్స్, బ్రిటీష్ సైన్యంపై విరుచుకుపడే విధానం మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. రాయలసీమ యాసలో "నేను కాయలి కాసాండంగా ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదబ్బా" అంటూ విజయ్ చెప్పిన డైలాగ్ డెలివరీ ఇంటెన్స్‌గా కుదిరింది. విజువల్స్ పరంగా సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, డస్టీ టోన్‌తో పీరియాడిక్ ఫీల్‌ను పర్ఫెక్ట్‌గా రీక్రియేట్ చేసింది. దానికి తోడు అజయ్ అతుల్ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాల్లోని ఆక్రోశాన్ని, ఎమోషన్‌ను



అమాంతం పెంచేసింది. హీరోయిన్ రష్మిక మందన్న ఒక భావోద్వేగ సన్నివేశంలో కనిపించి ఆకట్టుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ స్కేల్, రాహుల్ సాంకృత్యన్ విజన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ భారీగా హైలెట్ అయ్యాయి. గతంలో వచ్చిన రొటీన్ ఫార్ములా కాకుండా, చరిత్రలోని ఒక బలమైన విషాదాన్ని, దానిపై జరిగిన తిరుగుబాటును ఎంచుకోవడం ఈ ప్రాజెక్ట్‌కి అసలు బలం. విజయ్ తన కెరీర్‌లోనే మునుపెన్నడూ చూడని అత్యంత వయోలెంట్, పవర్‌ఫుల్ అవతారంలో మెప్పించారు.



# సంక్రాంతి నుంచి సమ్మర్ వరకు అందరికీ ఇబ్బందే!




ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం -ఫౌజీ- విడుదల తేదీపై ఓ ఆసక్తిర చర్చ సాగుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ తేదీ మారితే గనుక రాబోయే పెద్ద సినిమాల షెడ్యూళ్లు .. పండుగ సీజన్లపై దాని తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. -ఫౌజీ- డిసెంబర్ నుంచి వాయిదా పడితే దాని ప్రభావం మొదటగా పడేది సంక్రాంతి సీజన్‌పైనే. టాలీవుడ్‌లో సంక్రాంతి అనేది అత్యంత లాభదాయకమైన రేస్. ప్రభాస్ వంటి పాన్-ఇండియా స్టార్ సినిమా సంక్రాంతి బరిలోకి వస్తే? ఇతర పెద్ద సినిమాల విడుదల తేదీలు మారక తప్పదు. దీంతో 2027 సంక్రాంతి రేస్‌లో ఉండాలనుకున్న పలు క్రేజీ ప్రాజెక్ట్‌లు థియేటర్ల సర్దుబాటు కోసం ప్లాన్స్‌ను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్పుల ప్రభావం 2027 మార్చి నెలాఖరు వరకు కొనసాగే అవకాశాలున్నాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ -స్పిరిట్-ను మార్చి 5న విడుదల చేయాలని మేకర్స్ ఆలోచిస్తున్నారు. ఒకవేళ -ఫౌజీ- విడుదల ఆలస్యమైతే? ఆ ప్రభావం -స్పిరిట్- ప్రమోషన్లు , నిర్మాణ షెడ్యూళ్లపై పడి ఆ సినిమా విడుదల కూడా వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. ఒకే హీరో రెండు భారీ చిత్రాలు అతి తక్కువ వ్యవధిలో రావడం వ్యాపారపరంగా సాధ్యం కాదు కాబట్టి ఈ చిక్కులు తప్పవు. దీంతో పాటు 2027 సమ్మర్ రిలీజ్ ప్లాన్స్ కూడా పూర్తిగా డిస్టర్బ్ అయ్యే అవకాశం ఉంది. సాధారణంగా టాలీవుడ్ పెద్ద సినిమాలు వేసవి సెలవులను టార్గెట్ చేస్తూ డేట్లను ముందే లాక్ చేసుకుంటాయి.

# 100 కోట్లకు పైగా థియేట్రికల్ లాభాలు సాధించిన సినిమాలెన్ని?

తెలుగు పరిశ్రమ స్థాయి పాన్-ఇండియా రేంజ్‌కు పెరిగిన తర్వాత వందల కోట్ల వసూళ్లు సాధించడం సాధారణ విషయంగా మారింది. అయితే ఒక సినిమా బాక్సాఫీస్ వద్ద కేవలం 100 కోట్లు.. 200 కోట్లు గ్రాస్ వసూలు చేయడం వేరు.. థియేట్రికల్ హక్కుల కొనుగోలు వ్యయం పోను బిజినెస్ పరంగా డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలకు ఏకంగా 100 కోట్లకు పైగా నికర లాభాలు అందించడం వేరు. టాలీవుడ్ చరిత్రలోనే కేవలం థియేట్రికల్ రన్ ద్వారానే 100 కోట్ల ప్రాఫిట్ మార్కును అందుకున్న సినిమాలు చాలా అరుదుగా ఉంటాయి. ఆ అరుదైన ఫీట్ సాధించిన ఎనిమిది చిత్రాలున్నాయి. ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచినవి రాజమౌళి దృశ్యకావ్యాలు -బాహుబలి: ది బిగినింగ్-, -బాహుబలి: ది కన్క్లూజన్-, -'ఆర్ఆర్ఆర్-. -బాహుబలి 1- తెలుగు సినిమా బాక్సాఫీస్ హద్దులను పూర్తిగా చెరిపేసి నిర్మాతలకు, కొను గోలుదారులకు భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఇక -బాహుబలి 2- ప్రపంచవ్యాప్తంగా 1800 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, డిస్ట్రిబ్యూటర్లకు వందల కోట్ల ప్రాఫిట్స్ అందించింది. అదే బాటలో ఎన్టీఆర్, రామ్ చరణ్‌లతో రాజమౌళి తెరకెక్కించిన -ఆర్ఆర్ఆర్- కూడా థియేట్రికల్ రన్‌లోనే డిస్ట్రిబ్యూషన్ వర్గాలకు భారీ నికర లాభాలను అందించిన ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- సుకుమార్ కాంబినేషన్లో తెరకెక్కిన -పుష్ప 2: ది రూల్-, ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన -కల్కి 2898 ఎ.డి- చిత్రాలు పాన్-ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించాయి. ఈ రెండూ భారీ బడ్జెట్ - అత్యధిక థియేట్రికల్ బిజినెస్ జరుపుకున్నా? ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన ప్రభంజనంతో 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించి సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. పరిమిత బడ్జెట్‌తో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసిన -హనుమాన్- కూడా ఈ జాబితాలో ఉంది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. తక్కువ ధరకు థియేట్రికల్ రైట్స్ అమ్ముడవడంతో డిస్ట్రిబ్యూటర్లకు పెట్టుబడిపై కొన్ని రెట్ల లాభం తెచ్చిపెట్టి 100 కోట్ల ప్రాఫిట్ క్లబ్‌లో చేరిన అసాధారణ చిత్రంగా నిలిచింది. అలాగే విక్టరీ వెంకటేష్- అనిల్ రావిపూడి కలయికలో రిలీజ్ అయిన -సంక్రాంతికి వస్తున్నాం- చిత్రం కూడా థియేట్రికల్ రన్‌లో ఈ మైలురాయిని చేరుకుంది. పండుగ రేస్‌లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద 250 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించి కొనుగోలుదారులందరికీ 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించి వెంకటేష్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ప్రాఫిటబుల్ సినిమాగా రికార్డు సృష్టించింది. ఇటీవల మాస్ మహారాజా రవితేజ- శివ నిర్వాణ కాంబినేషన్‌లో రిలీజ్ అయి సరికొత్త చరిత్ర సృష్టించిన -ఇరుముడి- చిత్రం కూడా అరుదైన జాబితాలో చేరింది. తక్కువ బడ్జెట్...బిజినెస్ రేంజ్ లో రిలీజ్ అయిన -ఇరుముడి- 200 కోట్లకు పైగా గ్రాస్ సాధించి కొనుగోలుదారులకు ఊహించని రీతిలో 100 కోట్లకు పైగా నికర లాభాలను అందించింది. ఇలా ఎనిమిది చిత్రాలు తెలుగు పరిశ్రమ స్థాయిని, బిజినెస్ పొటెన్షియల్‌ను చాటి చెప్పాయి.




# గ్లామర్ వెనుక అసలైన కష్టం.. తెర వెనుక ఫ్యాక్ట్ బయటపెట్టిన రాశి సింగ్ !

చిన్నప్పటి నుంచే నటనపై ఆసక్తిని పెంచుకున్న ప్రముఖ బ్యూటీ రాశి సింగ్ కి.. 14 ఏళ్ల వయసులోనే ఒక కమర్షియల్ యాడ్ లో అవకాశం వచ్చినా. వ్యక్తిగత కారణాల వల్ల వదులుకుంది. చదువు పూర్తి చేసుకున్న ఈమె తొలిసారి ఇండిగో ఎయిర్ లైన్స్ లో ఎయిర్ హోస్టేస్ గా కెరియర్ ప్రారంభించింది. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉన్న సమయంలోనే 2019లో జెమ్ అనే తెలుగు చిత్రంతో నటిగా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత పోస్టర్, ప్రసన్న వదనం, బ్లైండ్ స్పాట్ , సంతాన ప్రాప్తిరస్తు, ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా ఈమెకు అనుకునేంత స్థాయిలో గుర్తింపును అందివ్వలేదు.



## రంభాషీగా రాశి సింగ్..

కానీ రీసెంట్గా అల్లరి నరేష్ హీరోగా వచ్చిన రంభ ఊర్వశి మేనక చిత్రంలో రంభ పాత్రతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది రాశి సింగ్. ఈ సినిమా పెద్దగా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా.. ఇందులో ఆమె నటన అందరి దృష్టిని ఆకట్టుకుంది. ముఖ్యంగా ఆమె గ్లామర్ కుర్రకారుకు మంచి ట్రీట్ ఇచ్చింది. అంతేకాదు రంభ పాత్రకు సంబంధించిన గ్లామర్ లుక్ ను ఎప్పటికప్పుడు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేస్తూ.. సినిమాపై అంచనాలు పెంచేసింది. సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోయినా రంభ పాత్రలో రాశి సింగ్ మాత్రం మంచి పేరు దక్కించుకుంది.

## గ్లామర్ వెనుక అసలైన కష్టం..

ముఖ్యంగా ఈ సినిమాలో రంభ పాత్రతో గ్లామర్ హంగులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఇంత అందంగా కనిపించడం వెనుక తాను పడ్డ కష్టాన్ని అభిమానులతో ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. గ్లామర్ వెనుక తాను పడ్డ కష్టం ఇదే అంటూ ఆ ఫోటోలను క్యాప్షన్ కూడా జోడించింది. రాశి సింగ్ ఈ ఫోటోలను షేర్ చేస్తూ.." మీరు తెరపై చూసేది అందం, ఆకర్షణ మాత్రమే. కానీ దానిని నిలబెట్టుకోవడానికి పడే కష్టం మీకు కనిపించదు. సరైన ఆహారం తీసుకోవడం, నా శరీరాన్ని, చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం.. ఫిట్గా ఉండడం, చల్లని రాత్రులలో, అర్ధరాత్రి వేళల్లో షూటింగ్ చేయడం, ఒళ్ళు నొప్పులు భరించడం.. అయినా కూడా ప్రదర్శన ఇవ్వడానికి తగినంత శక్తిని కలిగి ఉండడం.. అలాగే నన్ను రంభాషి అని పిలిచిన వాళ్లందరూ గెలిచారు. నేను ఆ పేరు నే ఉంచుకుంటాను. ఈ లుక్కును, నన్ను హ్యాండిల్ చేసిన నా టీం కి ప్రత్యేక ధన్యవాదాలు" అంటూ తెర వెనుక ఆ పాత్ర కోసం ఆమె పడ్డ కష్టాన్ని అభిమానులతో పంచుకుంది.



## తెర వెనుక కష్టాలను పంచుకున్న రాశి సింగ్..

ముఖ్యంగా రంభ పాత్ర కోసం ఆమె రెడీ అవుతున్న ఫోటోలను అలాగే నిప్పులతో చేతులను కాచుకుంటున్నట్టు ఇలా కొన్ని ఫోటోలను ఆమె షేర్ చేశారు . ఏదేమైనా సెలబ్రిటీలు మనకు వినోదాన్ని పంచుతున్నారు అంటే.. తెర వెనుక వారు పడే కష్టం ఎలా ఉంటుందో చెప్పడం వర్ణనాతీతం. ప్రస్తుతం రాశి సింగ్ షేర్ చేసిన ఫోటోలు, పంచుకున్న క్యాప్షన్ అభిమానులలో, నెటిజన్స్ లో సెలబ్రిటీస్ పై మరింత గౌరవాన్ని పెంచుతున్నాయి.

# ఇప్పుడు టి20 శైలికి మారిపోతా!

## హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ వ్యాఖ్య

## అఫ్గాన్‌తో సిరీస్‌కు సిద్ధమన్న హైదరాబాదీ

చెన్నై: దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ కెప్టెన్‌గా రెండు మ్యాచ్‌లు ఆడిన ఠాకూర్ తిలక్ వర్మ మూడు ఇన్నింగ్స్‌లలో వరుసగా 116 నాటౌట్, 51 నాటౌట్, 99 పరుగులు (మొత్తం 266) చేశాడు. టి20 స్పెషలిస్ట్‌గానే ప్రస్తుతం భారత జట్టులో ఉన్న తిలక్... ఫస్ట్ క్లాస్ ఆట శైలికి తగినట్లుగా తన బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. దులీప్ ట్రోఫీ సెమీస్, ఫైనల్ మ్యాచ్ కలిపి 461 బంతులు ఎదుర్కొన్న అతను... ఫైనల్ మ్యాచ్‌లో పరిస్థితికి అనుగుణంగా ఆడుతూ ఒకదశలో వరుసగా 63 బంతులపాటు బౌండరీ కొట్టకుండా నియంత్రణ కూడా ప్రదర్శించాడు. దీనికి ముందు భారత 'ఎ' జట్టుకు కూడా తిలక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. 'నా వ్యక్తిగత ఫామ్ చాలా బాగుంది. ఈ ప్రదర్శనతో నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనూ నా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చానని భావిస్తున్నా. ఈ మ్యాచ్‌లో కాస్త ముందుగానే దూకుడు ప్రదర్శించగలిగేవాడిని. కానీ పరిస్థితులకు, జట్టు అవసరాలకు తగినట్లు ఆడటమే ముఖ్యం. నాతో పాటు అవతలి ఎండ్‌లో మరో బ్యాటర్ నిలిస్తే సెషన్లవారీగా ఆడుతూ డ్రా కోసం ప్రయత్నించేవాడిని. కానీ వరుసగా వికెట్లు కోల్పోవడం ఈస్ట్‌కు మేలు చేసుంది. భారత 'ఎ' జట్టుకు, ఇప్పుడు సౌత్‌జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం వల్ల ఇతర యువ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం లభించింది. సారథిగా నేను ఎదుగుతున్నాననే భావన కలిగింది. కొన్ని సార్లు పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడే కెప్టెన్‌గా నా బాధ్యత మరింత పెరుగుతుంది' అని తిలక్ అభిప్రాయపడ్డాడు. ఈ నెల 13 నుంచి అఫ్గానిస్తాన్‌తో జరిగే టి20 సిరీస్‌లో భారత జట్టును గెలిపించడంపైనే ప్రస్తుతం దృష్టి పెట్టినట్లు తిలక్ వెల్లడించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ నుంచి ఒక్కసారిగా టి20లకు మారడం తనకు కష్టమేమీ కాదని, సిరీస్‌కు సిద్ధంగా ఉన్నానని అతను చెప్పాడు. 'ఇప్పుడు నా బ్యాటింగ్ గేర్లు మార్చి దూకుడు ప్రదర్శిస్తా. నా ఆటపై నాకు చాలా నమ్మకం ఉంది. ఇప్పుడు అఫ్గానిస్తాన్‌తో



సిరీస్ గెలవడమే లక్ష్యం. ఎరుపు రంగు బంతి మ్యాచ్ నుంచి టి20లకు మారడం అంత సులువు కాదు. అయితే సిరీస్‌కు ముందు ప్రాక్టీస్ కోసం నాకు రెండు రోజుల సమయం లభిస్తోంది. నా ఆట శైలిని మార్చుకునేందుకు ఇది సరిపోతుంది' అని తిలక్ వ్యాఖ్యానించాడు. భారత్ తరపున ఇప్పటి వరకు 64 టి20 మ్యాచ్‌లు ఆడిన తిలక్ 145.18 స్ట్రయిక్‌రేట్‌తో 1645 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 9 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అతను మరో 5

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## విజయ్‌పై టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు



చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో 'దవడ' వివాదం ఇంకా సద్దుమణగలేదు. ఎంకే స్టాలిన్ దవడ గాయాన్ని సీఎం విజయ్ ఎగతాళి చేశారంటూ రచ్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ సినిమాల్లోనే హీరో.. నిజ జీవితంలో పెద్ద విలన్" అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే నేతల కంటే తీవ్రంగా స్పందించిన దినకరన్.. విజయ్‌ను స్వార్థపరుడిగా అభివర్ణించారు. తన సొంత ప్రయోజనాల కోసం ఎవరినైనా బలి చేస్తారంటూ మండిపడ్డారు. విజయ్ పార్టీ టీవీకే అధికారంలో వచ్చిన తర్వాత తమిళనాడు రాజకీయ వాతావరణం వ్యక్తిగత విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. ప్రతిపక్షాలు, ముఖ్యంగా ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్.. నటి త్రిషతో విజయ్‌కు ఉన్న సంబంధాన్ని అడ్డం పెట్టుకుని ఆయన్ని కార్నర్ చేయడానికి ప్రయత్నించగా.. ముఖ్యమంత్రి మాత్రం డీఎంకే చీఫ్‌కు 1976లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో తగిలిన దవడ గాయాన్ని ఎగతాళి చేశారనే ఆరోపణలు వచ్చాయి. సెప్టెంబర్ 7న తమిళనాడు అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష డీఎంకే అవినీతిపై ఆయన విమర్శలు గుప్పిస్తూ ఇచ్చిన బాడీ లాంగ్వేజ్ సైగ.. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేగింది. అసెంబ్లీ సమావేశంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గతంలో ఎమర్జెన్సీ కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, నిర్బంధం గురించి ప్రస్తావిస్తున్న సమయంలో విజయ్ తన దవడను తాకుతూ ఒక రకమైన సైగ చేశారు. విజయ్ చేసిన ఈ బాడీ లాంగ్వేజ్ సైగ.. ఎమర్జెన్సీ (1975-77) కాలంలో 'మీసా' చట్టం కింద అరెస్టై, పోలీస్ కస్టడీలో దాడికి గురై దవడ గాయపడిన ఎంకే స్టాలిన్‌ను అపహాస్యం చేసేలా ఉందని డీఎంకే పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయ్‌పై విమర్శలు గుప్పించిన ఎంకే స్టాలిన్.. అదే సమయంలో తన దవడకు గాయం ఎలా జరిగిందో వివరించారు. 1975-77 మధ్య అమలైన ఎమర్జెన్సీ సమయంలో కరుణానిధి నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం రద్దయిన తర్వాత 1976లో తాను అరెస్టయిన విషయాన్ని స్టాలిన్ గుర్తుచేసుకున్నారు. జైలులో మేము ఎన్నో రకాల వేధింపులు ఎదుర్కొన్నాం. మమ్మల్ని కుష్ఠ రోగులతో కలిసి ఉంచారు. పది మందిని ఒక చిన్న గదిలో బంధించారు. ఆ గదిలో ఒకే ఒక మూత్రశాల ఉండేది. చుట్టూ దుర్వాసన ఉన్నప్పటికీ అక్కడే నిద్రించాల్సి వచ్చేదంటూ స్టాలిన్ తెలిపారు. పోలీసులు రాత్రిళ్లు మమ్మల్ని నిద్రపోనివ్వలేదు. లాఠీలతో కొట్టేవారు. జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీలతో కూడా మమ్మల్ని కొట్టించారు. నాతో పాటు జైలులో ఉన్న ఎంపీ చిట్టిబాబు అక్కడే మరణించారు. ఆ దాడిలో నా దవడ ఎముక విరిగింది" అని చెప్పారు. విజయ్ తాను ఆ హావభావం చేయలేదన్న వివరణను స్టాలిన్ తోసిపుచ్చారు.

### స్పేస్ పరిశోధనల్లో భారత్‌తో చేతులు కలపండి..

## ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ : అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని, భవిష్యత్ పరిశోధనల్లో భారత్‌కు సహ ప్రయాణికులుగా మారాలని ఫ్రాన్స్,ఇతర దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ అంతరిక్ష సదస్సును (ఇంటర్నేషనల్ స్పేస్ సమ్మిట్) ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భూమిపై మానవ జీవితానికి అంతరిక్షం ఎంతో కీలకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. శతాబ్దాలుగా అంతరిక్షం మానవ ఊహాశక్తిని ప్రేరేపిస్తోందని, నేడు అది వాతావరణం, వ్యవసాయం, సముద్రాలు, సమాజాల అభివృద్ధిని ప్రభావితం చేస్తోందని తెలిపారు. అంతరిక్ష కక్ష్యలు రద్దీగా మారుతున్న తరుణంలో.. ఘర్షణల కంటే సహకారానికి, స్వల్పకాలిక లాభాల కంటే సుస్థిరతకు, మినహాయింపుల కంటే సమ్మిళిత విధానానికి మన ఎంపికలు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని స్పష్టం చేశారు. 1960ల నుంచి భారత్, ఫ్రాన్స్‌లు అంతరిక్ష రంగంలో నమ్మకమైన భాగస్వాములుగా ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ సాంకేతికతను అందించడంలో ఇస్రో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుందని ప్రశంసించారు. ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కి పైగా ఉపగ్రహాలను భారతీయ రాకెట్లు అంతరిక్షంలోకి విజయవంతంగా చేరవేశాయని తెలిపారు. రైతులు, మత్స్యకారులకు సహాయం చేయడం నుంచి వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, నావిగేషన్ వరకు ఇస్రో సాంకేతికతలు కేవలం భారత్‌కే కాకుండా ప్రపంచానికి ఉపయోగపడుతున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ చట్టాలు, చర్చలు, సహకారంతో సురక్షితమైన, శాంతియుతమైన, సుస్థిరమైన అంతరిక్ష రంగాన్ని రూపొందించడానికి భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## ప్రారంభోత్సవానికి రాను, సిగ్గుపడుతున్నా: గడ్కరీ ధ్వజం



ముంబై- గోవా హైవే విస్తరణ పనులు నత్త నడకన సాగుతుండటంపై కేంద్ర రహదారి రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల ఆలస్యంపై ఇక ఎంతమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పనుల్లో విపరీతమైన ఆలస్యం జరగడం పట్ల సిగ్గుపడుతున్నానని, అందుకే ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోవడం లేదని ఆయన కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. గోవాలోని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్డు కారిడార్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు తన హెచ్చరికలను కార్యరూపంలోకి తెచ్చేందుకు, గడ్కరీ అక్టోబర్‌లో ముంబై నుండి గోవా వరకు రోడ్డు మార్గంలో ప్రయాణించి ఈ హైవే పనుల పూర్తి పొడవును స్వయంగా తనిఖీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆలస్యానికి, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. తన శాఖకు ఏడు ప్రపంచ రికార్డులు ఉన్నాయి కానీ ఇపుడు ఒకే సంవత్సరంలో అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడం, అధికారులను సస్పెండ్ చేయడంలో సరికొత్త రికార్డు సృష్టించాలనుకుంటున్నానంటూ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అదే సమయంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యాలకు, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు కొనసాగుతాయని గడ్కరీ తెలిపారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు మహారాష్ట్రలోని తీరప్రాంత కొంకణ్ గుండా వెళుతుంది. భూసేకరణ వివాదాలు, న్యాయపరమైన చిక్కులు, వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడం, అటవీ శాఖ అనుమతులు లభించడంలో ఆలస్యం కావడం వంటి అంశాలు పనుల పురోగతిని దెబ్బతీశాయని గడ్కరీ వివరించారు. ప్రస్తుతం అటవీ శాఖ అనుమతుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. గడ్కరీ వివరాల ప్రకారం ఈ హైవే పనులు ప్రస్తుతం సుమారు 93-94 శాతం పూర్తయ్యాయి. గణేష్ ఉత్సవాలకు ముందే సుమారు 90-95 శాతం పనులు పూర్తయ్యాయని మహారాష్ట్ర అధికారులు అంచనా వేశారు. అలాగే చిప్లున్ బైపాస్ వర్షాకాలం తర్వాత ప్రారంభమవుతుందని, మంగావ్ బైపాస్ పనులు జనవరి 2027 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు ఉన్నాయని అంచనా. ఇటీవలి నివేదికల ప్రకారం, ముంబై-గోవా హైవే ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 16,000 కోట్లు ఖర్చు చేశారు. కాగా ముంబై-గోవా హైవే విస్తరణ ప్రాజెక్ట్ దాదాపు 15 ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది. పాత రెండు లేన్ల హైవేను నాలుగు లేన్లుగా మార్చడం ద్వారా ముంబై - గోవా మధ్య ప్రయాణ సమయాన్ని దాదాపు 12 గంటల నుండి ఆరు గంటలకు తగ్గించే లక్ష్యంతో 2011లో ఈ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్ట్ మొదట 2016 నాటికి పూర్తవుతుందని భావించినప్పటికీ, ఇంకా అసంపూర్తిగానే ఉంది.

# సూర్యుడికి అద్దం పట్టాల్సిందేనా!

### ముంచుకొస్తున్న భూతాపోన్నతి ప్రభావం
### లక్ష్యాలకు మించి పెరగనున్న ఉష్ణోగ్రతలు
### సౌర వికిరణ మార్గమే శరణ్యం
### దేశాల మధ్య కుదరని ఏకాభిప్రాయం



భూమికి ముప్పు తప్పేట్టు లేదు... భూతాపోన్నతికి పగ్గాలేసే లక్ష్యం గురి తప్పుతోంది! సగటు ఉష్ణోగ్రతలు 1.8 డిగ్రీ సెల్సియస్ వరకూ పెరగడం ఖాయమవుతోంది.

మరి... తరుణోపాయం

భూతాపోన్నతి ప్రభావాలను తట్టుకునేందుకు ప్రపంచం సగటు ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కే పరిమితం చేయాలన్న లక్ష్యం నెరవేరే అవకాశాల్లేవు. ఫలితంగా ఈ శతాబ్దం అంతానికి భూమిపై అకాల వర్షాలు, వరదలు, విపరీతమైన వేడి కారణంగా మనిషి బతికే పరిస్థితులు ఉండవన్న శాస్త్రవేత్తల హెచ్చరికలు నిజమవడం తథ్యమన్న అంచనాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకో రెండు నెలల్లో టర్కీలో వాతావరణ మార్పులపై ఐరాస సదస్సు ఏం చేయబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. భూతాపోన్నతిని తగ్గించేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించడం ఒక్కటే మేలైన మార్గం అని అనుకునేవారు. వాతావరణ మార్పులకు తగ్గట్టుగా మనం మారడం, భూతాపోన్నతికి అనుగుణంగా సర్దుకుపోవడాన్ని ఓడిపోవడంగా భావించేవారు. అయితే ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. వాతావరణ మార్పులను అడ్డుకోవడంలో ప్రపంచదేశాలన్నీ విఫలం కావడంతో ఇప్పుడు క్లైమేట్ అడాప్టేషన్ (వాతావరణానికి తగ్గట్టుగా మనం మారడం) అత్యవసరమైన విధానంగా మారిపోయింది. ఫలితంగా ఒకప్పుడు వివాదాస్పదమైన సౌర వికిరణ మార్పు పద్ధతికి ప్రాచుర్యం పెరుగుతోంది.

### సౌర వికిరణ మార్పు అంటే?

సౌర వికిరణ మార్పు లేదా సోలార్ రేడియేషన్ మాడిఫికేషన్ (ఎస్ఆర్ఎం) అంటే సూర్యకాంతిలో కొంత భాగాన్ని మళ్లీ అంతరిక్షంలోకి పంపించడం అన్నమాట. సింపుల్‌గా చెప్పాలంటే సూర్యుడికి అద్దం పట్టడం. అయితే ఇందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భారీ ఏర్పాట్లు అవసరం. భూమిపై పడుతున్న సూర్యరశ్?మిలో కనీసం ఒక శాతాన్ని ఇలా వెనక్కు పంపించగలిగితే కర్బన ఉద్గారాల ద్వారా వాతావరణంలోకి చేరిన విషవాయువుల ప్రభావాన్ని తగ్గించవచ్చునని సగటు ఉష్ణోగ్రతలను గణనీయంగా తగ్గించవచ్చునని అంచనా. నేలపై లేదంటే అంతరిక్షంలో భారీసైజున్న అద్దాలు ఏర్పాటు చేసి సూర్యుడి నుంచి పడే కాంతి మళ్లీ అంతరిక్షంలోకి చేరేలా చేయాలని ఆలోచించారు. అలాగే అప్పుడప్పుడూ రసాయన కణాలు చల్లడం ద్వారా మేఘాలు మరింత సౌర రేడియోధార్మికతను వెనక్కు పంపించగలమని అంచనాలున్నాయి. అగ్?నపర్వతాలు బద్ధలైనప్పుడు వెలువడే పొగ ఆకాశాన్ని కమ్మేసి చాలాకాలంపాటు సూర్యరశ్మి కిందపడకుండా చేస్తున్నట్లు అన్నమాట.

### ఇదీ వివాదం...

ఎస్ఆర్ఎం వల్ల ప్రపంచ ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది కానీ.. కర్బన ఉద్గారాలను తగ్గించదు. పైగా పర్యావరణ వ్యవస్థలపై దీని ప్రభావం ఏమిటన్నది స్పష్టంగా తెలియదు. ఎలాగూ ఇది ఉందన్న సాకుతో పరిశ్రమలు, ప్రభుత్వాలు వాతావరణంలోకి చేరుతున్న విష వాయువులను తగ్గించడంపై దృష్టి పెట్టవన్నది మరో ఆందోళన. ఎస్ఆర్ఎం పద్ధతిని ఒకసారి వాడి... ఉష్ణోగ్రతలు తగ్గాయి కాబట్టి నిలిపేద్దామనుకుంటే అది కూడా ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉంది. ఈ 'టెర్మినేషన్ షాక్'వల్ల భూమి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. 2023 నుంచి సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే కొత్త ఇంధన నిబంధనలు అమల్లోకి వచ్?చిన తర్వాత ఉష్ణోగ్రతలు వేగంగా పెరగడం ఈ టెర్మినేషన్ షాక్‌ను ధ్రువీకరిస్తున్నాయి. మరోవైపు ఎస్ఆర్ఎం పద్ధతిపై ఇప్పటివరకూ స్పష్టమైన విధానం, మార్గదర్శకాలు, నియంత్రణ వ్యవస్థలు లేవు. ఈ నేపథ్యంలో దీన్ని కర్బన ఉద్గారాల తగ్గింపునకు ప్రత్యామ్నాయంగా కాకుండా.. ఎమర్జెన్సీ ఏర్పాటుగా మాత్రమే చూడాలని కొంతమంది నిపుణులు సూచిస్తున్నారు. 2024లో స్విట్జర్లాండ్ ఎస్ఆర్ఎంపై ఒక ప్రతిపాదనను ఐక్యరాజ్యసమితిలో ప్రస్తావించగా పలు దేశాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. జపాన్, సౌదీ అరేబియా వంటి దేశాలు మద్దతివ్వగా, పసిఫిక్, ఆఫ్రికా దేశాలు వ్యతిరేకించాయి. అమెరికాలో అధ్యక్షుడు ట్రంప్‌సహా కొందరు రిపబ్లికన్లు వాతావరణ మార్పులనే కొట్టిపారేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టర్కీలో జరగబోయే వాతావరణ మార్పుల సదస్సు ఎస్ఆర్ఎంపై ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా? అన్నది ఆసక్తికరమైన విషయంగా మారింది.

# పిల్లలు ఏఐ మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు!



ఏఐని వేగంగా అందిపుచ్చుకుంటున్నది స్కూల్ పిల్లలే. ఇటీవలి అధ్యయనాల ప్రకారం, పిల్లలు పెద్దల కంటే మూడు రెట్లు వేగంగా కృత్రిమ మేధ సాంకేతికతలను స్వీకరిస్తున్నారు. లక్షలాది మంది పిల్లలు హోంవర్క్ చేయడానికి చాట్‌బాట్‌ల సహాయం తీసుకుంటున్నారు. కౌమారదశలో ఉన్న వారు స్కూల్ ప్రాజెక్టులు చేయడానికి మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితానికి కూడా ఏఐని అనుసంధానం చేస్తున్నారని ఇటీవలి ప్రపంచ స్థాయి గణాంకాలు చూపిస్తున్నాయి. ' లక్షలాదిమంది పిల్లలు తమ సందేహాలు తీర్చుకోవడానికి ఏఐ మీద ఆధారపడుతున్నారు. బాల్యంలో కలిగే సందేహాలు ఒక ఎత్తయితే, కౌమారంలోకి అడుగుపెట్టినప్పుడు అనేక సందేహాలు వేధిస్తుంటాయి. పెద్ద వాళ్ల దగ్గర వ్యక్తం చేయడానికి సంకోచించే సందేహాల నివృత్తి కోసం ఏఐని ఆశ్రయిస్తున్నారు. వ్యక్తిగత ఆందోళనల నుంచి బయటపడడానికి మార్గాలను చూపించమని కోరుతున్నారు. సంక్షోభం నుంచి గట్టెక్కడానికి కూడా చాట్‌బాట్‌లనే ఎంచుకుంటున్నారు. ' యూనిసెఫ్ కొన్ని దేశాల్లో ఏఐ వినియోగం మీద సర్వే నిర్వహించింది. ఈ ఏడాది జూన్‌లో విడుదల చేసిన ఆ నివేదిక ప్రకారం 'పిల్లలు పెద్దవాళ్ల కంటే మూడురెట్లు ఎక్కువ వేగంతో కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుంటున్నారు. 20 మిలియన్లకు పైగా పిల్లలు ఏఐని ఉపయోగిస్తుండగా, వారిలో 13 మిలియన్ల మంది పాఠశాల పని కోసం, 2 మిలియన్ల మంది జీవిత సలహాల కోసం వాడుతున్నారు. ' కెనడా 2026 అధ్యయనం ప్రకారం పిల్లల్లో ఐదుగురిలో ఒకరు ఏఐ నుంచి ఎమోషనల్ సపోర్టు తీసుకుంటున్నారు. ముఖ్యంగా న్యూక్లియర్ కుటుంబాల్లో సింగిల్ చైల్డ్ ఒంటరితనం కారణంగా ఏఐని ఫ్రెండ్‌గా మార్చుకుంటున్నారు. ' కామన్‌సెన్స్ మీడియా, ప్యూ రీసెర్చ్ సెంటర్‌ల సర్వేల నివేదిక ప్రకారం 64 నుంచి 70 శాతం టీనేజర్లు సమాచారం వెతకడానికి, మేధోమథనం చేయడానికి, హోమ్‌వర్క్ చేయడానికి ఏఐ చాట్‌బాట్‌లను వాడుతున్నారు.

### ప్రమాదాలూ ఉన్నాయి!

' కాగ్నిటివ్ ఆఫ్లోడింగ్: ఏఐ షార్ట్‌కట్‌లపై ఎక్కువగా ఆధారపడటం వలన జ్ఞానం మెదడు పొరల్లో దీర్ఘకాలం నిక్షిప్తం కాలేదు. ఏకాగ్రతతో అభ్యసించడం ద్వారా మెదడు అభివృద్ధి చెందుతుంది. ఏఐ ఈ ప్రక్రియకు ఆటంకం.

' ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) వంటి విద్యా నివేదికలు మితిమీరిన ఏఐ వాడకం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రోజువారీ పాఠ్యాంశాల అభ్యాసంలో ఏఐని వాడడం వల్ల పరీక్షల్లో మార్కులు తగ్గడం, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యాలు క్షీణించడం వంటి ప్రమాదాలను హెచ్చరిస్తున్నాయి.

' ఏఐ గొప్ప ట్యూటర్‌గా పని చేస్తోంది, తక్షణం ఫలితాలనిస్తుంది. కానీ ఆ సాధనం లేకుండా సొంతంగా మెదడుతో ఆలోచించి పనిచేసే సామర్థ్యాన్ని పెంచడం లేదని అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ స్పష్టం చేసింది.

' అత్యంత ఆందోళన కలిగించే అంశం తప్పుడు సమాచారం. స్కామ్, సామాజిక అంశాల విషయంలో పక్షపాత ధోరణితో, అర్ధవాస్తవాలతో ఉద్దేశపూర్వకంగా కూర్చిన సమాచారాన్ని నూరుశాతం నిజమని నమ్మే ప్రమాదం లేకపోలేదు.

' బహిర్గతమైన భయాలు: మూడింట ఒక వంతు మంది పిల్లలు ఆన్‌లైన్ మోసాలు, తప్పుడు సమాచారం గురించి ఆందోళన చెందుతుండగా, నాలుగింట ఒక వంతు మంది లైంగికంగా అసభ్యకరమైన డీప్‌ఫేక్‌లకు భయపడుతున్నారు.

### వాస్తవాన్ని గుర్తించడం...

ఏఐ రూపొందించిన కంటెంట్‌ను, మనిషి సృష్టించిన కంటెంట్ నుంచి వేరు చేసి చెప్పడంలో పిల్లలు ఇబ్బంది పడతారు. పరికరాలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఈ తేడాను గుర్తించే కచ్చితత్వం తగ్గుతుందని 'నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్' చెబుతోంది. ' తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో అభ్యాసం కొనసాగితే అర్ధవాస్తవాలను, పక్షపాత ధోరణి సమాచారాన్ని వడపోసి పిల్లలను కచ్చితమైన సమాచారం వైపు నడిపించడం జరుగుతుంది. ఏఐ విషయంలో అలాంటి భద్రత లేకపోవడం ఆలోచించాల్సిన అంశం అని విద్యావేత్తల సూచన.

# మామిడి పండు చూడ మేలిమై యుండును.. పొట్ట విప్పి చూడ..

### అంతర్జాతీయ ప్రీమియం ఎగుమతి
### మార్కెట్లలో మన మామిడికి తిరస్కరణ..
### పైకి నిగనిగ.. లోపల పురుగులు..
### రసాయనాల వాడకంతో తగ్గుతున్న నాణ్యత..
### సాగు పద్ధతి మార్చాలంటున్న నిపుణులు



(స్పెషల్ డెస్క్) : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా ఉంది మన మామిడి సంగతి. ప్రపంచంలోనే రుచికరమైన మామిడి పండ్లను భారత్ ఉత్పత్తి చేస్తోంది. అయినప్పటికీ, అంతర్జాతీయ ప్రీమియం ఎగుమతి మార్కెట్లలో మన మామిడి తీవ్ర ఆంక్షలు, తిరస్కరణలను ఎదుర్కొంటోంది. విదేశీ వినియోగదారులు మంచి ధర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా, నాణ్యత లోపాల వల్ల భారతీయ రైతులు, ఎగుమతిదారులు ఏటా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ సంక్షోభానికి బహుళ కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

### కాంట్రాక్టు సాగుతో కష్టాలు

దేశంలో సుమారు వెయ్యి మామిడి రకాలున్నప్పటికీ, మార్కెట్లో గిరాకీ కలిగినవి 24 ప్రధాన రకాలు మాత్రమే. వీటిల్లో మన తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా సాగయ్యే బంగినపల్లి, చిన్నరసం, పెద్దరసం అగ్రస్థానంలో నిలిచాయి. మామిడి తోటల యజమానుల్లో అత్యధికులు నగరాల్లో నివసిస్తూ తోటలను కాలానికి కాంట్రాక్టర్లకు లీజుకిస్తున్నారు. కేవలం మూడు నెలల సీజన్ లో వచ్చే తాత్కాలిక లాభాలపై తప్ప, తోట దీర్ఘకాలిక ఆరోగ్యంపై కాంట్రాక్టర్లకు శ్రద్ధ ఉండదు. తక్కువ సమయంలో పంటను కాపాడుకోవటానికి విచక్షణారహితంగా సింథటిక్ ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్లు వాడుతున్నారు. నాసిరకం పురుగు మందులను అవసరానికి మించి పిచికారీ చేస్తున్నారు. ఫలితంగా పురుగు మందులను తట్టుకునే శక్తిని చెట్లు పెంచుకుంటున్నాయి. వీటివల్ల కాయ పైకి నిగనిగలాడేలా కనిపించినా, నాణ్యత ఉండటం లేదు. కాయల్లో పండు ఈగ వంటి పురుగులతో పాటు ప్రమాదకర రసాయనాల అవశేషాలు నిండిపోతున్నాయి.

### ఆంక్షలు.. తిరస్కరణలు

పండ్లలో పురుగుల బెడద, అధిక రసాయన అవశేషాల కారణంగా విదేశీ తనిఖీ సంస్థలు భారతీయ మామిడి కన్‌సైన్‌మెంట్లను వెనక్కి పంపుతున్నాయి. వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ కేంద్రాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు లోపించటంతో జపాన్ దిగుమతులను నిలిపివేయగా, అధిక పురుగుమందుల అవశేషాలున్నాయనే ఆరోపణలతో నేపాల్ ఇటీవల సరిహద్దుల్లో కఠిన నిబంధనలు తెచ్చింది. గతంలో యూరోపియన్ యూనియన్ కూడా భారతీయ మామిడిపై నిషేధం విధించింది. అమెరికాకు ఎగుమతి చేయడానికి నిర్దేశించిన నాన్--టారిఫ్ ఆంక్షలు దాటటం సాధారణ రైతులు, ఎగుమతిదారులకు పెనుభారంగా మారింది. ప్రస్తుతం మన ఎగుమతుల్లో మూడోవంతు కేవలం గల్ఫ్ దేశాలకే పరిమితమవుతోంది.

### సాగు పద్ధతి మార్చాలి..

మామిడి రైతులు రసాయన రహిత ఆధునిక సాగు పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి. నిరంతర వ్యక్తిగత పర్యవేక్షణ అత్యవసరం. బాధ్యతారహితంగా తోటలను నిర్వహించే కాంట్రాక్టర్ల చేతులకు తోటలను వదిలేయకుండా శాస్త్రీయ పద్ధతుల్లో క్రిమిసంహారకాల వాడకం తగ్గించి, ఫైటోశానిటరీ ప్రమాణాలు పాటిస్తేనే ప్రపంచ మార్కెట్లో భారతీయ మామిడికి అసలైన గిట్టుబాటు ధర లభిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

### మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరించాలి

భూయజమానుల నిర్లక్ష్యం, నాణ్యత లేని రసాయన వ్యవసాయం మన మామిడి ఎగుమతులను దెబ్బ తీస్తున్నాయి. బంగినపల్లికి మంచి నిల్వ సామర్థ్యం ఉన్నా ఏపీ, తెలంగాణల్లో ఇర్రేడియేషన్, ప్యాక్‌హౌస్ వసతులు లేవు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పదేళ్లకు పైగా మామిడి సాగు చేస్తూ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నాను. అమెరికాలో, గల్ఫ్ దేశాల్లో డోర్ డెలివరీ చేస్తున్నాం. ఈ ఏడాది యూరప్‌కూ విస్తరిస్తున్నాం. మామిడి ఎగుమతి సీజన్ కేవలం 45--60 రోజులే. పేపర్‌వర్క్, ఎయిర్ ఫ్లైట్‌పై జీఎస్టీ పెనుభారంగా మారాయి. ప్రభు త్వం రసాయనాలకు సబ్సిడీలు ఆపి, సహజ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. ఎగుమతులు పెంచేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించటంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి.

శుభోదయ
శుక్రవారం - 11 - సెప్టెంబర్ - 2026

# లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే.. ఎప్పటికప్పుడు వీటిని తీసుకోవాల్సిందే..!




మన శరీరంలో కాలేయం అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరం నుండి విషాన్ని బయటకు పంపించడం, శరీర జీవక్రియలను నిర్వహించడం, జీర్ణక్రియకు మద్దతు ఇవ్వడం, శరీరానికి అవసరమైన పోషకాలను నిల్వ చేయడం ఇలా అనేక రకాల విధులను ప్రతిరోజూ నిర్విరామంగా నిర్వర్తిస్తుంది. కాలేయ ఆరోగ్యం ఏ మాత్రం దెబ్బతిన్నా మొత్తం శరీర ఆరోగ్యం దెబ్బతింటుంది. కనుక కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు కొన్ని సులభంగా తయారు చేసుకునే పానీయాలను తీసుకోవడం ద్వారా కాలేయాన్ని శుభ్రపరుచుకోవడంతో పాటు కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

## నీరు, గ్రీన్ టీ..

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నీటిని ఎక్కువగా తాగాలి. నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడంతో పాటు శరీరం నుండి విషాలు ఎక్కువగా బయటకు తొలగిపోతాయి. అలాగే క్రీమ్, చక్కెర వంటివి లేకుండా బ్లాక్ కాఫీ తాగడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా ఉంటుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా చేయడంలో సహాయపడతాయి. దీంతో ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి కాలేయ సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. క్రమం తప్పకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కాలేయ ఆరోగ్యాన్ని కాపాడడంలో మనకు దోహదపడతాయి.

## బీట్ రూట్, నిమ్మకాయ..

బీట్‌రూట్ రసం కూడా కాలేయ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కాలేయానికి ఒక సహజ టానిక్ లాగా పని చేస్తుంది. బీట్‌రూట్ రసంలో ఉండే బీటాలైన్లు, నైట్రేట్లు కాలేయం నిర్విషీకరణ ఎంజైమ్‌లను పెంచుతాయి. బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల కాలేయ వాపు తగ్గుతుంది. అలాగే ఆకుకూరలు, క్యారెట్లు, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసి తీసుకోవడం వల్ల కాలేయంలో డీటాక్సిఫికేషన్ ప్రక్రియతో పాటు కాలేయం ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. రోజూ ఒక గ్లాస్ నిమ్మకాయ నీరు తాగడం వల్ల కాలేయం సహజంగా శుభ్రపడుతుంది. నిమ్మకాయ నీరే అని చాలా మంది తేలికగా తీసుకుంటారు. కానీ కాలేయాన్ని శుభ్రపరచడంలో ఇది ప్రభావవంతంగా పని చేస్తుంది. అదే విధంగా ఉసిరికాయ జ్యూస్ కూడా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీనిలో విటమిన్ సితో పాటు యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మనకు సహాయపడతాయి.

## కొబ్బరి నీళ్లు..

కొబ్బరి నీరు కూడా కాలేయ ఆరోగ్యానికి మద్దుతు ఇస్తాయి. కొబ్బరి నీటిని తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉంటుంది. శరీరానికి కావల్సిన ఎలక్ట్రోలైట్స్, పోషకాలు అందుతాయి. అల్లం శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అల్లం కషాయాన్ని తీసుకోవడం వల్ల వాపు తగ్గి కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీరు కూడా కాలేయానికి మేలు చేస్తుంది. జీలకర్ర నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తద్వారా కాలేయంపై ఒత్తిడి తగ్గుతుంది. కాలేయంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కూడా సమర్థవంతగా జరుగుతుంది. ఇలాంటి సహజసిద్దమైన పానీయాలను తీసుకోవడం వల్ల కాలేయం పనితీరు మెరుగుపడడంతో పాటు కాలేయ ఆరోగ్యం కూడా సరిగ్గా ఉంటుంది. ఈ పానీయాలను తాగడం వల్ల మొత్తం శరీరానికి కూడా మేలు కలుగుతుంది.

# బనానా షేక్ లేదా అరటి పండ్లు.. రెండింటిలో ఏవి ఎక్కువ మేలు చేస్తాయి..?



మన ఆరోగ్యానికి అరటిపండ్లు ఎంతో మేలు చేస్తాయన్న సంగతి మనకు తెలిసిందే. అరటిపండ్లల్లో ఫైబర్ తో పాటు మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. పేగు ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి సులభంగా జీర్ణమవుతాయి కనుక వీటిని తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అల్పాహారంగా, చిరుతిండిగా లేదా జిమ్ చేసిన తరువాత వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొంత మంది అరటిపండును నేరుగా తినడానికి ఇష్టపడరు. అరటిపండ్లతో బనానా షేక్ వంటి వాటిని తయారు చేసి తీసుకుంటూ ఉంటారు. అయితే అరటిపండ్లను నేరుగా తినడం మంచిదా.. స్నాక్స్ రూపంలో తీసుకోవడం మంచిదా.. అన్న సందేహాలు కూడా మనలో చాలా మందికి వస్తూ ఉంటాయి.

## మిల్క్ షేక్ వద్దు..

అరటిపండును ఏ విధంగా తీసుకోవడం మన ఆరోగ్యానికి, జీర్ణవ్యవస్థకు మంచిదో.. నిపుణులు దీని గురించి ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అరటిపండును ఏ రూపంలో తీసుకోవాలో వ్యక్తి శారీరక శ్రమపై ఆధారపడి ఉంటుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు అరటిపండును నేరుగా తీసుకోవడం మంచిది. జిమ్ కి వెళ్లే వారు, భారీ వ్యాయామాలు చేసే వారికి క్యాలరీలు ఎక్కువగా అవసరమవుతాయి. కనుక వ్యాయామాలు చేసేవారు అరటిపండును మిల్క్ షేక్ రూపంలో తీసుకోవడం మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆయుర్వేదం ప్రకారం అరటిపండును నమలి తినడం మంచిదని వారు చెబుతున్నారు. అరటిపండును నమలడం వల్ల లాలాజలంలో ఉండే సమ్మేళనాలు సక్రియం చేయబడతాయి. దీంతో జీర్ణక్రియ సులభతరం అవుతుంది.

## జీర్ణ క్రియకు ఆటంకం..

అరటిపండును నమలడం వల్ల దానిలో ఉండే మొత్తం పోషకాలు శరీరానికి చక్కగా అందుతాయి. అరటిపండుతో స్మూతీ, షేక్ వంటివి చేసి తీసుకోవడం వల్ల దానిని నమలాల్సిన అవసరం లేదు. ఇది జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని కలిగిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం రెండు రెండు వేరువేరు పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల శరీర సహజ సమతుల్యం దెబ్బతింటుంది. అరటిపండును పాలతో కలిపి మిక్స్ చేసి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీంతో కఫం పెరుగుతుంది. ఇది సైనస్, జలుబు, అలర్జీ వంటి వాటికి దారి తీస్తుంది. బనానా షేక్ పొట్టలోకి చేరిన తరువాత అరటిపండులో ఉండే మాలిక్, సిట్రిక్ ఆమ్లాలు పాలతో కలిసి పెరుగుగా మారుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. బనానా షేక్ జీర్ణం అవ్వడానికి సమయం పట్టడంతో పాటు పోషకాలను కూడా శరీరం సరిగ్గా గ్రహించదు. కనుక అరటిపండును నేరుగా తీసుకోవడమే మంచిదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్యాలరీలు ఎక్కువగా కావాల్సిన వారు అరటిపండును తిన్న రెండు గంటల తరువాత పాలు తాగడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. ఇలా చేయడం వల్ల జీర్ణ సమస్యలు రాకుండా ఉండడంతో పాటు శరీరానికి పోషకాలు కూడా చక్కగా అందుతాయి. పొట్ట సంబంధిత సమస్యలతో బాధపడే వారు బనానా షేక్ ను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

# ఐటీ కంపెనీలను వణికిస్తున్న ఆ 'పేరు' మాదే..

అమెరికా ఆధారిత ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' భారత విస్తరణ ప్రణాళికలు చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. అదే పేరుతో పనిచేస్తున్న భారతీయ సంస్థ 'ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్'.. తమ బ్రాండ్‌కు గందరగోళం కలుగుతోందని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ కేసు భారత కోర్టులో పెండింగ్‌లో ఉండటం వల్ల, దేశంలో ఆంత్రోపిక్ వ్యూహాత్మక ప్రణాళికలు క్లిష్టతరం అయ్యే అవకాశముంది.

## అమెరికా ఆంథ్రోపిక్ ఎం ఇండియా ఆంథ్రోపిక్

టెక్ క్రంచ్ నివేదిక ప్రకారం.. ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ గత నెలలో కర్ణాటక వాణిజ్య కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. 2017 నుంచే తమ సంస్థ "ఆంత్రోపిక్" పేరును ఉపయోగిస్తోందని, అమెరికా సంస్థ భారత మార్కెట్లో ప్రవేశించడం వల్ల వినియోగదారుల్లో గందరగోళం ఏర్పడుతోందని కంపెనీ పేర్కొంది. స్థానిక సంస్థ తన ముందస్తు వినియోగాన్ని అధికారికంగా గుర్తించాలని, అలాగే మరింత గందరగోళం నివారించేందుకు తగిన ఉపశమనం ఇవ్వాలని కోరుతోంది. అదనంగా, రూ.1 కోటి నష్టపరిహారం కూడా డిమాండ్ చేసినట్లు సమాచారం.




## భారతీయ సంస్థ వాదన ఏమిటంటే..

ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మొహమ్మద్ అయ్యాజ్ ముల్లా టెక్ క్రంచ్‌తో మాట్లాడుతూ, ఈ ఫిర్యాదు వెనుక ఉద్దేశం ఘర్షణ కాదని, తమ ముందస్తు వినియోగానికి అధికారిక గుర్తింపు పొందడమేనని తెలిపారు. గుర్తింపు లభించకపోతే, చట్టపరమైన పోరాటాన్ని కొనసాగించవచ్చని ఆయన స్పష్టం చేశారు. భారతీయ సంస్థ తమ వెబ్‌సైట్‌లో "ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (అప్లికేషన్ పెండింగ్) ట్రేడ్‌మార్క్" అని పేర్కొంది. ట్రేడ్‌మార్క్ నమోదు ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, ఇది నేరుగా ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన కేసుగా పరిగణించబడకపోవచ్చు. అయితే కోర్టు భారతీయ సంస్థకు అనుకూలంగా తీర్పు ఇస్తే, అమెరికా సంస్థ భారతదేశంలో తన పేరును మార్చాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశముంది.

## కేసు ప్రస్తుత స్థితి

జనవరి 20న కోర్టు ఆంత్రోపిక్ ఇండియాకు సమన్లు జారీ చేసింది. అయితే ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. అంటే, సంస్థ తన కార్యకలాపాలను తక్షణం నిలిపివేయాల్సిన అవసరం లేదు. తదుపరి విచారణ ఫిబ్రవరి 16న జరగనుంది. ఇదిలా ఉండగా, ఆంత్రోపిక్ ఏఐ భద్రతా విభాగాధిపతి మృణక్ శర్మ రాజీనామా చేశారు. ఇటీవల 'ఎక్స్' (ట్విట్టర్)లో తన రాజీనామాను ప్రకటించారు. తాను వెంటనే కొత్త వెంచర్ ప్రారంభించడం లేదని, తదుపరి నిర్ణయం తీసుకునే ముందు స్వల్ప విరామం తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు.

# గుడ్డులోని పచ్చ సొనను తినాలా.. వద్దా.. వైద్యులు ఏమని చెబుతున్నారు..?



మన శరీరానికి కావల్సిన పోషకాలను అందించే ఆహారాల్లో గుడ్డు ఒకటి. దీనిలో ప్రోటీన్స్, ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. గుడ్డును తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. గుడ్డును తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగి, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని చాలా మంది గుడ్డు తెల్లసొనను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. పచ్చసొనను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం వాస్తవమే అయినప్పటికీ గుడ్డు పచ్చసొనను తీసుకోవడం వల్లే మన శరీరానికి ఎక్కువ పోషకాలు అందుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనలోనే విటమిన్ ఎ, ఇ, ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు. ఆరోగ్యవంతులు గుడ్డు పచ్చసొనను ఆహారంగా తీసుకోవచ్చని ఇది శరీరానికి శక్తిని అందించే పోషక కేంద్రం లాంటిదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

## అనుకున్నంత హానికరం కాదు..

అంతేకాకుండా తాజా పరిశోధనలు గుడ్డు పచ్చసొనలో ఉండే కొలెస్ట్రాల్ మన రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిలపై తక్కువ ప్రభావాన్ని చూపిస్తుందని తెలియజేస్తున్నాయి. పచ్చసొనను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే అవి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలే అయి ఉంటాయని చెడు కొలెస్ట్రాల్ పై ఇవి ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనను మితంగా తీసుకోవడం వల్ల రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిలపై పెద్దగా ప్రభావం ఉండదని గుడ్డు పచ్చసొనలో ఉండే కొలెస్ట్రాల్ అనుకున్నంత హానికరం కాదని వారు తెలియజేస్తున్నారు. పచ్చసొన పోషకాలతో నిండి ఉంటుందని ఇది ఆరోగ్యకరమైనదని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు తెల్లసొన ఒక శోథ నిరోధక ప్రోటీన్ అని కేవలం తెల్లసొనను తీసుకోవడం అంత మంచిది కాదని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

## ఎల్‌డీఎల్, హెచ్‌డీఎల్..

కొలెస్ట్రాల్ గురించి తప్పుడు అభిప్రాయాన్ని కలిగి ఉండడం వల్ల చాలా మంది గుడ్డు పచ్చసొనను ఆహారంగా తీసుకోవడం లేదని వైద్యులు అంటున్నారు. మన శరీరంలో కణ నిర్మాణానికి, హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు పనితీరుకు, రోగనిరోధక వ్యవస్థకు కొలెస్ట్రాల్ చాలా అవసరం. దాదాపు 85 శాతం కొలెస్ట్రాల్ ను మన శరీరంలో ఉండే కాలేయమే తయారు చేస్తుంది. కొలెస్ట్రాల్ లో కూడా తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రోటీన్ (ఎల్‌డిఎల్), అధిక సాంద్రత కలిగిన లిపో ప్రోటీన్( హెచ్‌డిఎల్) అని రెండు రకాలు ఉంటాయి. ఎల్‌డిఎల్ అధిక స్థాయిల ఉండడం వల్ల ధమనులలో అడ్డంకులు ఏర్పడి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. కనుక దీనిని చెడు కొలెస్ట్రాల్ అంటారు. హెచ్‌డిఎల్ ని మంచి కొలెస్ట్రాల్ అని అంటారు. ఇది ధమనుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను కాలేయానికి తీసుకెళ్లి శరీరం బయటకు వెళ్లేలా చేస్తుంది.

## ఇవి కూడా అవసరమే..

ఇక శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగడానికి గుడ్డు పచ్చసొన కారణం కాదని అధిక సంతృప్త కొవ్వులు ఉండే ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ధూమపానం వంటి కారణాల వల్లే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు. గుడ్డు పచ్చసొనను పూర్తిగా మానేయకుండా దీనిని మితంగా తీసుకుంటూనే సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, శారీరక శ్రమ ఉండేలా చూసుకోవడం, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండడం, ధూమపానం మానేయడం వంటివి చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయని వైద్యులు సలహా ఇస్తున్నారు. గుడ్డు పచ్చసొన ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ దీనిని మితంగా తీసుకోవాలి. అలాగే గుండె జబ్బులు ఉన్న వారు, దయాబెటిస్ రోగులు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు, గౌట్ సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# డయాబెటిస్ ఉన్నవారికి అద్భుతంగా పనిచేసే మూలికలు..

మారిన జీవనవిధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల్లో దయాబెటిస్ కూడా ఒకటి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. దయాబెటిస్ బారిన పడితే జీవితాంతం మందులు మింగాల్సిందే. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం వల్ల శరీరంలో ఇతర అవయవాల ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కనుక దయాబెటిస్ ను ఎల్లప్పుడూ అదుపులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని రకాల మూలికలను వాడడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడడంతో పాటు తీపి తినాలన్న కోరిక కూడా తగ్గుతుందని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఈ మూలికలను తీసుకోవడం వల్ల అడాప్టోజెన్ ఒత్తిడి తగ్గడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా అదుపులో ఉంచే మూలికలు ఏమిటో.. ఇప్పుడు తెలుసుకుందాం.

## మెంతులు, దాల్చిన చెక్క..

రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో మెంతులు మనకు ఎంతో సహాయపడతాయి. వీటిలో కరిగే ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది చక్కెర శోషణను నెమ్మదిస్తుంది. మెంతులను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీతో పాటు ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు, శరీర జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా మెంతి నీటిని తీసుకోవడం, మెంతులను నానబెట్టి తీసుకోవడం, వంటల్లో మెంతులను వాడడం వల్ల టైప్ 2 దయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ అర టీ స్పూన్ దాల్చిన చెక్క పొడిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సామర్థ్యం పెరుగుతుంది. భోజనం తరువాత వచ్చే గ్లూకోజ్ స్పైక్స్ తగ్గుతాయి. ఓట్ మీల్, స్మూతీ, మసాలా టీ వంటి వాటితో దాల్చినచెక్క పొడిని కలిపి తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అయితే దాల్చిన చెక్క ప్రతికూల ప్రభావాలను కూడా చూపిస్తుంది కనుక దీనిని తక్కువ మోతాదులో తీసుకోవడం చాలా అవసరం.

## పొడపత్రి, కాకరకాయ..

అలాగే మధునాశిని అని పిలువబడే మూలికను తీసుకోవడం వల్ల తీపి తినాలనే కోరిక తగ్గుతుంది. దీనిని పొడపత్రి అని కూడా పిలుస్తారు. ఈ మొక్క ఆకులను నమలడం లేదా టీ లో వేసి తీసుకోవడం వల్ల చక్కెర శోషణ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కాకరకాయ కూడా మనకు సహాయపడుతుంది. పరగడుపున కాకరకాయ జ్యూస్ తాగడం వల్ల దయాబెటిస్ అదుపులో ఉంటుంది. తులసి ఆకులను నేరుగా నమలడం లేదా కషాయం చేసి తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్తాయిలు సమతుల్యంగా ఉంటాయి. తులసి ఆకులను తీసుకోవడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కార్టిసాల్ స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. అలోవెరా జ్యూస్ ను తాగడం వల్ల ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు తగ్గుతాయి. పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జ్యూస్ మాత్రమే కాకుండా అలోవెరా సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది.



## జాగ్రత్తలు తప్పనిసరి..

మనుపసుపు అనే మూలిక కూడా రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తివంతమైన బయోయాక్టివ్ సమ్మేళనాలను కలిగి ఉంటుంది. దీనిని దారుహరిద్ర అని కూడా పిలుస్తారు. దీనిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. వేపను తీసుకోవడం వల్ల కూడా రక్తంలో చక్కెర స్థాయిలు సహజంగా తగ్గుతాయి. వేపను తీసుకోవడం వల్ల ఇన్సులిన్ గ్రాహక శక్తి పెరుగుతుంది. ఈ విధమైన మూలికలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ మూలికలను తీసుకునే విషయంలో జాగ్రత్త అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ మూలికలను తీసుకోవడం నెమ్మదిగా ప్రారంభించాలి. మొదటగా ఒక్క మూలికను మాత్రమే తీసుకోవాలి. మన సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తాజాగా, పొడిగా లేదా టీ రూపంలో తీసుకోవాలి. వేప, కాకర వంటి వాటిని పరగడుపున తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. దయాబెటిస్ కు ముందు నుండే మందులు వాడే వారు ఈ మూలికలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, రోజూ వ్యాయామం చేస్తూ ఈ మూలికలను తీసుకోవడం వల్ల మరిన్ని మంచి ఫలితాలను చూడవచ్చు.